విశాలాంధ్ర

వైఎస్ఆర్ కడప జిల్లా | అన్నమయ్య జిల్లా

గురువారం 9, జనవరి - 2025 | 8 పేజీలు

రాష్ట్ర రోడ్డు రవాణా సమస్యలు పరిష్కరించండి : కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి మంత్రి రాంప్రసాద్ రెడ్డి వినతి

విశాలాంధ్ర–రాయచోటి: ఆంధ్రప్రదేశ్‌లోని రోడ్డు రవాణా సమస్యలు పరిష్కరించాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కోరారు. బుధవారం న్యూఢిల్లీలోని నితిన్ గడ్కరీ కార్యాలయంలో కలిసి ఏపీలో ప్రమాదల నివారణలో భాగంగా కడప – రాయచోటిలో 4 కిలో మీటర్ల టన్నెల్ ఏర్పాటుకు రవాణా బృందం సమగ్ర నివేదిక చేసినట్లు తెలిపారు. అటవీ శాఖ అనుమతులు రాగానే పనులు చేపట్టేందుకు సిద్ధం చేసినట్లు తెలిపారు. అలాగే రాయచోటిలో రోడ్ల విస్తరణ గ్రామాలు, మండల కేంద్రాలు, జిల్లా హెడ్ క్వార్టర్స్ మధ్య మెరుగైన కనెక్టివిటీని సులభతరం చేసేందుకు సెంట్రల్ రోడ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ నిధుల ద్వారా పనులకు అనుమతులు ఇవ్వాలని మంత్రి కోరారు. కడప నుండి రాయచోటి వరకు 4 లైన్ల రహదారి,రాజంపేట – రాయచోటి – కదిరి రహదారి – రాష్ట్ర రహదారి నుండి జాతీయ రహదారిగా మెరుగుపరిచేందుకు శాఖపరమైన ఆదేశాలు జారీ చేయాలని కేంద్ర మంత్రిని రవాణా శాఖ మంత్రి కోరారు. దీనిపట్ల కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గారు స్పందిస్తూ రాష్ట్ర రవాణా అభివృద్ధికి పూర్తిగా సహకరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖకు సంబంధించిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సాగునీటితో జిల్లా సస్యశ్యామలం సాధ్యం

రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కె.వి.ప్రసాద్, రామానాయుడుల పిలుపు

విశాలాంధ్ర– రాయచోటి రూరల్ : అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గం లోని అన్ని మండలాలకు సాగునీటిని అందించి సస్యశ్యామలం చేయడమే ముఖ్య ఉద్దేశమని రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కె.వి.ప్రసాద్ అన్నారు. ఈ జిల్లా మహాసభకు ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి ప్రసాద్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామానాయుడు ఆహ్వానించడం జరిగింది.ఈ జిల్లా మహాసభ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వంగమల రంగారెడ్డి మరియు జిల్లా అధ్యక్షులు శివరామకృష్ణదేవరా అధ్యక్షతన ఈ మహాసభ జయప్రదం చేయడం జరిగింది ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్నటువంటి సమస్యలను తెలుసుకొని ఆయన ప్రాజెక్టులపై ఉన్న సమస్యలను ఏదైతే హంద్రీనీవా నుండి వెలుగల్లుకు నీరు వదలాలని వెల్లగల్లు నుండి చిన్న కాలువలు మరియు పెద్ద కాలువలు పూర్తి చేసి ఆ కాలువలకు నీరు వదిలితే చెరువులకు మరియు బోర్లకు నీరు అందుబాటులో ఉంటే రైతు అనే వాళ్ళు రాయచోటి నియోజకవర్గం 6 మండలాల్లో ఉన్నటువంటి రైతులు అందరూ కూడా పంటలు పండించుకుంటారని ఆయన ఈ సభ ముఖంగా తెలియజేయడం జరిగింది తర్వాత రాష్ట్ర ఉపాధ్యక్షులు రామానాయుడు మాట్లాడుతూ పీలేరు చిన్నమండెం మదనపల్లి గుర్రంకొండ చుట్టుపక్కల ప్రాంతాలలో ఉన్నటువంటి టమోటా రైతులు టమోటా ఎక్కువ మతంలో పండిస్తున్న పంటకు గిట్టుబాటు ధర అనేది కల్పించాలని ఆయన డిమాండ్ చేయడం

2

కరువును మండలాలకు కేంద్ర ప్రభుత్వ సహాయం ఎంతో అవసరం : రాయచోటి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి

జిల్లాలో కరువు మండలాలలో పర్యటించిన కేంద్ర ప్రభుత్వ ఇంటర్ మినిస్ట్రీయల్ బృందం

విశాలాంధ్ర–మదనపల్లె: అన్నమయ్య జిల్లాలో తీవ్రమైన కరువును ఎదుర్కొన్న మండలాలకు కేంద్ర ప్రభుత్వ సహాయంతో అవసరమని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో కరువు మండలాల క్షేత్ర పరిశీలన కోసం కేంద్ర ప్రభుత్వం సుప్రియ మాలిక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముగ్గురు సభ్యుల బృందం, జిల్లాలోని బి కొత్తకోట, వాల్మీకిపురం, మదనపల్లె, తంబళ్లపల్లె, తదితర మండలాలను సందర్శించారు. కేంద్ర ప్రభుత్వ బృందం వివిధ మండలాలను సందర్శించిన సందర్భంగా కేంద్ర బృందం, ఖరీఫ్ సీజన్లో పడిన వర్షపాతం, పశువులకు అందుబాటులో ఉన్న పశుగ్రాసం, పండించిన పంటల నష్టాలు తదితర విషయాలపై స్థానిక రైతులతో చర్చించారు. గతంలో లాగా రాష్ట్ర లేదా కేంద్ర ప్రభుత్వాలు పశుగ్రాసం అందించగలిగితే తమకు ఎంతో సహాయంగా ఉంటుందని కొంతమంది రైతులు కేంద్ర బృందానికి తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న వివిధ రకాల పథకాలను ఉపయోగించుకొని పశుగ్రాసం సమస్యను పరిష్కరించుకోవాల్సిందిగా సూచించారు. మండలాలను సందర్శించిన అనంతరం మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో వివిధ శాఖల జిల్లా అధికారులతో కేంద్ర బృందం, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలో నమోదైన కరువు తీవ్రత కరువు మండలాలపై కేంద్ర బృందానికి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్లో అన్నమయ్య జిల్లాలోని 19 మండలాలను తీవ్రమైన కరువు మండలాలుగా ప్రకటించిందని ఈ సందర్భంగా తెలిపారు. అన్నమయ్య జిల్లాలో ఖరీఫ్ 2024 సీజన్లో జూన్ నుండి సెప్టెంబర్ వరకు వర్షపాతం చాలా తక్కువగా నమోదయిందన్నారు. తద్వారా పలు మండలాలలో కరువు విలయ తాండవం చేస్తోందని కేంద్ర బృందానికి తెలిపారు. అంతేకాకుండా పశువులకు పశుగ్రాసం తక్కువగా అందుబాటులో ఉందని దీని వల్ల ఎంతోమంది రైతులు నష్టపోయారని బృందానికి తెలిపారు. ఎన్ డి ఆర్ ఎఫ్ నిబంధనల ప్రకారం కరువు పీడిత మండలాలకు సుమారు 11 కోట్ల రూపాయలు సాయం అందించాల్సి ఉందని పేర్కొన్నారు. గ్రామ మరియు మండలాల స్థాయిలో బృందాలను ఏర్పాటు చేసి కరువు మండలాలలో పంట నష్టాలపై నివేదికలను తీసుకున్నామని, కరువు మండలాలలో దాదాపు 33 శాతం పంట నష్టం వచ్చిందని తెలిపారు. ముఖ్యంగా వేరుశనగ బాజ్ర పంటలు వేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. వ్యవసాయం మీద కాకుండా పశువుల పై ఆధారపడి జీవనం సాగించే రైతులు కూడా ఎంతో నష్టపోయారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. వర్షపాతం నమోదు తక్కువగా ఉండడంతో వివిధ రిజర్వాయర్లలో నీరు తక్కువగా ఉండటం వల్ల కరువు మండలాలలో ప్రైవేటు ట్యాంకర్ల

2

కరోనా లాగా హెచ్ఎంపివి వైరస్ ప్రభావం ఉండదు

○ప్రజలు భయపడాల్సిన పనిలేదు
○డా.రమేష్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు డా.వి.కిరణ్‌కుమార్



విశాలాంధ్ర – జమ్మలమడుగు : ప్రజలు హెచ్ఎంపివి వైరస్ గురించి భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని, కరోనా వైరస్ లాగా భయపడాల్సిన అవసరం లేదని డాక్టర్ రమేష్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు డాక్టర్. వి.కిరణ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం 'విశాలాంధ్ర'తో ఆయన మాట్లాడుతూ ఇటీవలే ప్రజలు హెచ్.ఎం.పి.వి వైరస్ పై అనేక అపోహలు, వదంతులు ప్రచారం జరుగుతున్నాయని వాటిని ప్రజలు నమ్మవద్దని చెప్పారు.2001 సంవత్సరంలోనే హెచ్ ఎంపివి వైరస్ ను కనుగొన్నారని అది ప్రాణాంతకరమైన వైరస్ కాదని ఆయన తెలిపారు. ఆ సమయంలోనే హెచ్ఎంపీవీ వైరస్ పై పరిశోధనలు జరిగాయని, ప్రజలు జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుం దన్నారు. ఈ వైరస్ దగ్గు, జలుబు కారణంగా వస్తుందని ప్రజలు భయాందోళనకు గురి కావాల్సిన అవసరం లేదన్నారు. హెచ్ఎంపివి వైరస్ చిన్నపిల్లలకు,వృద్ధులకు మాత్రమే వస్తుందన్నారు. ఈ వైరస్ సోకినంత మాత్రాన ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం వాటిల్లదిఅన్నారు. జలుబు,దగ్గుకు తీసుకుంటున్న సాధా రణ చికిత్సతోనే నయమవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ వైరస్ కు పెద్దగా యాంటీ బయాటిక్ ఇంజక్షన్లు తీసుకోవాల్సిన అవసరం ఏమీ ఉండదన్నారు. ప్రజలు వైరస్ రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుం దన్నారు.గత 20 సంవత్సరాల నుండి ఈ వైరస్ ఉందని దానివలన ఎలాంటి ప్రాణ నష్టం జరిగినట్లు ఆధారాలు లేవన్నారు. ఇటీవల బెంగళూరు పట్టణంలో ఇద్దరు చిన్న పిల్లలకు హెచ్ఎంపివి వైరస్ సోకిందని దానివల్ల ఎలాంటి ప్రమాదం జరగలేదన్నారు. చిన్న పిల్లలకు రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండడం వలన వారికి వైరస్ త్వరగా సోకిందన్నారు. ఒకరి నుండి ఇంకొకరికి హెచ్ఎంపివి వైరస్ వ్యాపించదన్నారు. దగ్గు, జలుబు ఎక్కువ కాలం పాటు ఉన్నట్లయితే అలాంటి వారు వెంటనే డాక్టర్ను సంప్రదించి చికిత్స తీసుకోవాలని తెలిపారు. మాస్క్ ధరించడం చాలా మంచిదన్నారు. జాగ్రత్తలు తీసుకోవడం వల్ల ప్రజలు వైరస్లు నుండి సురీక్షితంగా ఉండొచ్చు అన్నారు.

హరిలో రంగ హరి

అలనాటి హరిదాసులేరీ..?

విశాలాంధ్ర–పులివెందుల: సంక్రాంతి పండుగ అనగానే రంగవల్లులు, గంగిరెద్దులతో పాటు హరిదాసులు కూడా గుర్తొస్తారు. అటువంటి సంక్రాంతి పర్వదినం సందర్భంగా పల్లెటూర్లలో కనిపించే హరిదాసులు కనుమరుగయ్యారు.సంక్రాంతి అనగానే గుర్తుకు వచ్చే వాటిలో హరిదాసులు ఒకరు. సంక్రాంతి పండుగ నెల పొడవునా గ్రామీణ ప్రాంతాల్లో వీరు దర్శన ఇస్తారు. అందమైన రంగవల్లులు, గొబ్బెమ్మలతో పాటు కనిపించే హరిదాసులు కాలగమనంలో దూరమయ్యారు. మానవ నాగరికత ఆవిర్భవించినప్పటి నుండి హరిదాసులు సంక్రాంతి పండుగ వేళ దర్శనం ఇవ్వడం అరుదు. తెలుగు గొప్పదనాన్ని సంకీర్తనలతో తెలియజేయడం హరిదాసుల ప్రాముఖ్యతను అంతరించుకుంటుంది. తెలుగువారికి అన్ని పండుగలలో సంక్రాంతి పర్వదినం అతి ముఖ్యమైనది. ఏడాది పొడవునా కష్టించిన వంట లక్ష్మిని ఇంటికి తెచ్చుకున్న కష్టజీవులైన రైతులందరూ ఆనందోత్సవాల

2

అలనాటి హరిదాసులేరీ..?

(మొదటి పేజీ తరువాయి)

నడుమ జరుపుకునే పండుగగా భావిస్తారు. సంవత్సరములో ఎప్పుడూ కనిపించని హరిదాసులు ధనుర్మాసంలోనే దర్శనమిస్తారు. నెల రోజులపాటు భక్తి పాటలతో ఇంటింటిని పావనం చేస్తారు. తెల్లవారగానే స్నానమాచరించి కాషాయ వస్త్రాలను ధరించి ముఖముపై నామాలు దిద్దుకుని మెడలో పూలదండను రుద్రాక్ష మాలలను ధరించి నెత్తి మీద నామాలతో అలంకరించిన అక్షయపాత్రను తలపై పెట్టుకుని భుజం మీద తంబురాను మీటుతూ ఒక చేత్తో చిడతలతో తాళం వేస్తూ శ్రావ్యంగా పాటలు పాడుతూ కాళ్ల గజ్జలతో నృత్యం చేస్తూ హరిలోరంగ హరి అంటూ ప్రతి ఇంటి ముంగిట దర్శనమిస్తారు. అటువంటి హరిదాసుకు ఇల్లాలు లేదా పిల్లలు ఫల పుష్పాదలతో దోసెడు బియ్యం తీసుకువస్తే హరిదాసు వినమ్రతతో మోకాలు పై కూర్చుని అక్షయపాత్రలో వేయించుకుని ఆ ఇంటి కుటుంబాన్ని దీవిస్తారు. ఇలా ఒక్కరితోపాటు మరి కొంత మంది హరిదాసులు కూడా గ్రామీణ ప్రాంతాల్లో తిరగడం వల్ల పల్లెటూర్లు కోలాహలంగా కనిపిస్తాయి. ఇలా నెలరోజులపాటు గ్రామీణ ప్రాంతాల్లో తిరిగి సంవత్సరానికి సరిపడా బిక్షాన్ని సంపాదించుకోవడం వారి జీవనశైలికి పడుతుంది. వారికి కేటాయించిన గ్రామాలకే పరిమితమవుతారు. ఇలా నెలపొడువునా హరిదాసుల గ్రామంలో ఉండటం వల్ల వారి పాటలతో సందడి నెలకొంటుంది. బాల బాలికలు కూడా ఉత్సాహంగా పోటీపడుతూ హరిదాసులా వ్యవహరిస్తారు. హరిదాసుల వలె ప్రతిసారి కూర్చొని లేవడం కష్టమైన భక్తి భావంతో ఆడుతూ అలసటను మరచిపోతారని పెద్దలు చెబుతున్నారు. ఇలా జానపద కళాకారులతో కన్నుల పండుగగా సంక్రాంతి పర్వదినాలు ముగుస్తాయి. పంటను ఇంటికి తెచ్చుకున్న కలలాడే రైతు కుటుంబాలు సంక్రాంతి శోభతో అందరినీ ఆదరిస్తారు. మరి చాలామంది హరిదాసులు కాలగమనంలో కరువయ్యారు. కాలవశమున వచ్చిన మార్పుల నేపథ్యంలో చాల మంది కులవృత్తులకు స్వస్తి పలికారు. ఇటువంటి వారిలో గంగిరెద్దులాటల వారు కూడా ఒకరు. ప్రభుత్వాలు చదువుకు అధిక ప్రాధాన్యతమిస్తుండటతో వారి పిల్లలు కూడా ఎంచక్కా చదివించుకుంటున్నారు. ఏదో అక్కడక్కడ తప్పిస్తే మరి ఎక్కడ వారి ఆచూకీ లేకుండా పోయింది. సంక్రాంతి పండుగకు శోభ తెచ్చే హరిదాసులు రావాలని పండుగ పూర్వ వైభవం సంతరించుకోవాలని ఆశిద్దాం.

కేంద్ర ప్రభుత్వ సహాయం ఎంతో అవసరం : రాయచోటి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి

(మొదటి పేజీ తరువాయి)

ద్వారా నీటి సరఫరాను అందించినట్లుగా పేర్కొన్నారు. కరువు పీడిత ప్రాంతాల నుండి ఎంతోమంది రైతులు వేరే ప్రాంతాలకు వలస వెళ్లిపోయారని దీని మూలంగా ఎంజిఎన్ఆర్ఇజిఎస్ ప్రధానమంత్రి కృషిసంచాయి యోజన తదితర పథకాలను సమర్థవంతంగా అమలు చేసి రైతులకు అండగా నిలిచామని పేర్కొన్నారు. జిల్లాలో నమోదైన కరువు తీవ్రతపై వివిధ తెలుగు పత్రికలు మరియు ఆంగ్ల పత్రికలు వివిధ వ్యాసాలు రాసినట్లుగా తెలిపారు. అనంతరం, జిల్లా వ్యవసాయ శాఖ, జిల్లా పశుసంవర్ధక శాఖ, జిల్లా ఉద్యానవన శాఖ, డ్వామా, గ్రామీణ నీటి సరఫరా శాఖ తదితర శాఖల అధికారులు వారి శాఖలకు సంబంధించిన వివిధ విషయాలపై కేంద్ర బృందానికి వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో 30 మండలాలకు గాను 19 మండలాలు అత్యంత తీవ్రమైన కరువును ఎదుర్కొన్నాయని, వివిధ శాఖల జిల్లా అధికారులు అందించిన నివేదికల మేరకు కరువు మండలాలకు కేంద్ర ప్రభుత్వం సహాయం చేయవలసిందిగా కేంద్ర ప్రభుత్వ బృందాన్ని కోరారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్, తదితరులు పాల్గొన్నారు.

సాగునీటితో జిల్లా సస్యశ్యామలం సాధ్యం

(మొదటి పేజీ తరువాయి)

జరిగింది. ఈ సభాముఖంగా ఈ మహాసభలో జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి గారు మాట్లాడుతూ రాయచోటి కూరగాయల మార్కెట్లో రాత్రి ఒంటిగంట సమయంలో వేలంపాట పాడడం జరుగుతుంది రైతు దగ్గర తక్కువ ధరకు కొని తర్వాత వాళ్ళు ఎక్కువ మొత్తంలో అమ్ముకోవడం జరుగుతుంది ఆయన ఈ సభలో తెలియజేయడం జరిగింది ఈ సమావేశానికి అన్నమయ్య జిల్లా సిపిఐ కార్యదర్శి పిఎల్ నరసింహులు డాక్టర్ మహేశ్వర్ రాజు అలాగే అర్చన విద్యాసంస్థలు మదన్ మోహన్ రెడ్డి రాయచోటి ఏరియా కార్యదర్శి బాలకృష్ణారెడ్డి, అధ్యక్షుడు హరినాథ రెడ్డి, కార్యదర్శి కెవిఎస్ నాయుడు, గౌరవ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, గిరిజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుక్కే విశ్వనాథ్ నాయక్, సిపిఐ సహాయ కార్యదర్శి మహేష్, సిపిఐ ఏరియా కార్యదర్శి సిద్దిగళ్ళ శ్రీనివాసులు, పీలేరు సిపిఐ కార్యదర్శి వెంకటేష్, కోడూరు ఇంచార్జ్ జ్యోతి చిన్నయ్య, ములకలచెరువు సీపీఐ ఇన్చార్జి అంజన్నప్ప, కడప జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు సుబ్బారెడ్డి, మరి కొంతమంది రైతులు పాల్గొని ఈ జిల్లా రెండవ మహాసభను పెద్ద ఎత్తున జయప్రదం చేశారు.

ఏపీజీబీపై ఈనెల 12 జరిగే సదస్సును జయప్రదం చేయండి



విశాలాంధ్ర-కడపకార్పొరేషన్:కడపలో ఉన్న ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని ఇతర ప్రాంతాలకు తరలించడం లేదని చెప్పేంతవరకు, ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని, ఈనెల 12 తేదీ ఐఎంఏ హాల్‌లో పెద్ద ఎత్తున సెమినార్ నిర్వహిస్తున్నామని, దీనికి కాంగ్రెస్ పార్టీ మాజీ మంత్రి శైలజా నాథ్, తుల సెంద్ర, ఎమ్మెల్సీలు, సిపిఐ, సిపిఎం, ఆర్ సి పి నాయకులు పాల్గొననున్నారని, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి తెలిపారు. బుధవారం కడప కాగితాల పెంటలోని ఏపీజీబీ కార్యాలయం ఎదుట అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు.

రిమ్స్‌లో ఆస్తమా క్లినిక్ ప్రారంభం..సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి

విశాలాంధ్ర-కడప : ప్రపంచవ్యాప్తంగా 300 మిలియన్ల జనాభా ఆస్తమావ్యాధితో బాధపడుతున్నారు ప్రతిరోజు వెయ్యి మంది ప్రజలు ఆస్తమావ్యాధితో మరణిస్తున్నారు. ఆస్తమా వ్యాధి నిర్ధారణ చికిత్స మరియు నివారణ పద్ధతులు కచ్చితంగా పాటిస్తే ఆస్తమాను సులువుగా నియంత్రించవచ్చును .వ్యాధి నిర్ధారణ చేయకుండా మందులు వాడకం వలన అనేక దుష్పరిణామాలు కలుగును. అధిక సమయం అధిక వ్యయబారం కలుగును. ఆస్తమా వేది కారకాలు ముఖ్యముగా వైరల్ ఇన్ఫెక్షన్లు మందులు ధూళి దుమ్ము కల వాతావరణం పెంపుడు జంతువులు పుప్పొడి మొదలగునవి. ఆస్తమా వ్యాధి లక్షణాలు దగ్గు, ఆయాసం, ఛాతిలో బరువు, పిల్లికూతలు వంటి శబ్దాలు మొదలగునవి ముఖ్యంగా కనబడును. ఆస్తమావ్యాధి నిర్ధారించుటకు ఊపిరితిత్తుల సామర్థ్య పరీక్షలు శ్వాసకోశ నిపుణులచే నిర్ధారించబడిన ఇతర పరీక్షలు కలవు ఆస్తమావ్యాధి చికిత్స కొరకు అనేక పరికరాలు అందుబాటులో కలవు స్పెషలిస్ట్ పలమనాలజీ వైద్య నిపుణులచే రోగిని పరీక్షించిన వారికి తగినటువంటి పరికరాలు మందులు ఇవ్వబడును. ఆస్తమా వ్యాధి నివారణ కొరకు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి పల్మనరీ మెడిసిన్ ఓపి విభాగంతో వివరముగా తెలుపుతున్నారు. గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్

రిమ్స్ లోని పలమనేరి మెడిసిన్ విభాగంలో బుధవారం ఆస్తమా క్లినిక్ ప్రారంభించి పై సేవలు అన్ని అందించుచున్నారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతి థిగా ఆసుపత్రి సూపరిం టెండెంట్ డాక్టర్ జివి. రమా దేవి పాల్గొన్నారు. ఈ కార్య క్రమంలో సిఎస్ఆర్ఎంఓ డాక్టర్ వై.శ్రీనివాసులు, డిప్యూటీ ఆర్ఎం వో లు డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ సునీత, డాక్టర్ గీత మరియు పలమ నాలజీ విభాగం వైద్యులు, ఆస్తమా వ్యాధిగ్రస్తులు పాల్గొన్నారు. ప్రతి నెల రెండవ బుధవారం ఆస్తమా క్లినిక్ సేవలు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో కల్పనాలజీ విభాగంలో వినియోగించుకోవాలన్నారు.

వై.వి.యు ఏడాది పీజీ ప్రవేశాలకు దరఖాస్తులు

దరఖాస్తు గడువు ఈనెల 17.. ప్రవేశాల కౌన్సిలింగ్ ఈనెల 21

విశాలాంధ్ర-కడప వైవీయూ : యోగి వేమన విశ్వవిద్యాలయం నాలుగేళ్ల ఆనర్స్ డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు లెటరల్ ఎంట్రీ విధానంలో ఏడాది పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులో ప్రవేశాలకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని వైస్ చాన్సిలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి వెల్లడించారు. జాతీయ విద్యా విధానం-2020 అమలులో భాగంగా నూతనంగా ఏడాది పీజీ కోర్సు (2024-25 విద్యా సంవత్సరం) నోటిఫికేషన్ సందర్భంగా ఆయన తన ఛాంబర్‌లో ఇంచార్జ్ రిజిస్ట్రార్ , ప్రిన్సిపల్ ఏజీ దాము, డీన్ లు ఆచార్య కంకణాల గంగయ్య, ఆచార్య వై సుబ్బరాయుడు, సి డి సి డీన్ ఆచార్య రఘు బాబు, ప్రవేశాల సంచాలకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్‌తో కలిసి తన చాంబర్లో భేటీ అయ్యారు. నోటిఫికేషన్ సంబంధించి వారితో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ॰ యోగి వేమన విశ్వవిద్యాలయ పరిధిలోని అఫిలియేషన్ కలిగిన అనుబంధ కళాశాలలో పీజీ కోర్సులకు అనుమతి ఇచ్చామన్నారు. హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ, బయోకెమిస్ట్రీ, బయో టెక్నాలజీ, మైక్రోబయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, కామర్స్, సైకాలజీ, కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ తదితర కోర్సుల్లో ప్రవేశాలు ఉంటాయన్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి గాను దరఖాస్తులు కోసం yvu.edu.inను సంప్రదించాలని సూచించారు. వెబ్ సైట్‌లో విశ్వవిద్యాలయంలో లభించే కోర్సులు, సీట్లు సంబంధిత నిబంధన గల బ్రోచర్ ఉంటుందన్నారు. 21వ తేదీన విశ్వవిద్యాలయ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్‌లో ప్రవేశాల కౌన్సిలింగ్ ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో ప్రజా సంబంధాల విభాగం సంచాలకులు పి.సరిత పాల్గొన్నారు.

రాజ్యాంగ లక్ష్యాలను పాఠ్యాంశాల్లో చేర్చాలి



విశాలాంధ్ర- రాయచోటి రూరల్ : భారత రాజ్యాంగ లక్ష్యాలను విద్యార్థి దశ నుండే ప్రతి విద్యార్థి తెలుసుకోవడానికి పాఠ్యాంశాలలో భారత రాజ్యాంగ లక్ష్యాలను చేర్చాలని భారత న్యాయవాదుల సంఘం అన్నమయ్య కడప ఉమ్మడి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టి. ఈశ్వర్ అన్నారు. భారత రాజ్యాంగం చట్టాలపై అవగాహన న్యాయ చైతన్య సదస్సును అనే అంశంపై స్థానిక శ్రీ చందన శ్రీ ఒకేషనల్ జూనియర్ కాలేజ్ నందు భారత న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో చైతన్య సదస్సును బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ మనదేశంలో ఐదువేల పైచిలుకు కులాలు పదుల సంఖ్యలో మతాలు ఉన్నాయన్నారు. మతాలకు సంబంధించిన హక్కులను రక్షించే విధంగా ఆయా మత గ్రంథాలు ఉన్నాయని ఆయా మతస్తులు నమ్ముతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా చట్టాల గురించి న్యాయవాది ఆనంద్ కుమార్ బాల్య వివాహాల చట్టం గురించి న్యాయ వాదిపై రెడ్డయ్య ట్రాఫిక్ చట్టాల గురించి న్యాయవాది ధనుంజయ్ కుమార్ పర్యావరణం గురించి న్యాయవాది నాగ ముని ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధిక చట్టం గురించి న్యాయవాది రవిశంకర్ , హెూమియోన్ భాష ఆర్డి ఆనంద్,ఏఐఎస్ఎఫ్ కోటేశ్వరరావు చందన శ్రీ ఒకేషనల్ జూనియర్ కళాశాల రాజేశ్వరమ్మ ప్రిన్సిపల్ సుబ్బరాయుడు ధన్యవాదాలు తెలియజేశారు.

రాయలసీమకే గర్వకారణం అన్నమాచార్య యూనివర్సిటీ

రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథ్ రెడ్డి ఉద్ఘాటన

విశాలాంధ్ర-రాజంపేట:రాజంపేట అన్నమాచార్య యూనివర్సిటీ రజతోత్సవ వేడుకల్లో భాగంగా రెండవ రోజు బుధవారం సాయంత్రం వేడుకలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథ్ రెడ్డి, ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ జి సతీష్ రెడ్డి ముఖ్య అతిధులుగా, విశ్వవిద్యాలయ ఛాన్సర్ డాక్టర్ చొప్ప గంగిరెడ్డి పాల్గొన్నారు. ఈ రజతోత్సవాలలో భాగంగా భారత ప్రభుత్వ సమాచార,ప్రసార మంత్రిత్వ శాఖ వారిచే అనుమతించబడిన అన్నమాచార్య కమ్యూనిటీ రేడియో స్టేషన్ 98.6 మెగా హెడ్జెస్‌ను వేడుకకు విచ్చేసిన ముఖ్య అతిథులు మేడా రఘునాథ్ రెడ్డి, డాక్టర్ జి సతీష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ అన్నమాచార్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ 25 సంవత్సరాలు పూర్తి చేసుకొని సిల్వర్ జూబ్లీ జరుపుకుంటుంది అంటే రాయలసీమ ప్రాంతానికే గర్వకారణమన్నారు. ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ జి సతీష్ రెడ్డి మాట్లాడుతూ ఈ సంస్థ నాణ్యమైన విద్యను అందించడమే కాకుండా విద్యార్థులలో సృజనాత్మకత, పట్టుదల మరియు విలువలను పెంపొందించడంలో తోడ్పడిందన్నారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఛాన్సర్ డాక్టర్ చొప్ప గంగిరెడ్డి మాట్లాడుతూ రజతోత్సవ వేడుకల్లో భాగంగా వివిధ రంగాలకు చెందిన 25 మంది ప్రముఖులను అన్నమాచార్య యూనివర్సిటీ రెసోనన్స్ అవార్డ్స్ (ఎయుఆర్ఏ) అవార్డ్స్‌తో సత్కరించడం తమకు ఎంతో గర్వకారణం అని తెలిపారు. జేఎన్టీయూ వైస్ ఛాన్సర్ డాక్టర్ హెచ్ సుదర్శన్ రావు,వై.వి.యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ డాక్టర్ కృష్ణా రెడ్డి, రాయలసీమలోని విద్యాసంస్థలు స్థాపించి విద్యావకాశాలు కల్పించిన మహెూన్నత వ్యక్తులు పీవీకేకే గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ అండ్ ఫార్మర్ మినిస్టర్ ఆఫ్ ఏపీ గవర్నమెంట్ పల్లె రఘునాథ్ రెడ్డి, రాయలసీమ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ చైర్మన్ వై కొండారెడ్డి,కె ఎస్ ఆర్ ఎం గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ కరస్పాండెంట్ శ్రీమతి కే రాజేశ్వరి, ఎన్‌బికేఆర్ఐఎస్‌టి డైరెక్టర్ వి.విజయకుమార్ రెడ్డి, ఉన్నతమైన కంపెనీల హెచ్ఆర్లు కీర్తి నాయక్ - టెక్ మహీంద్రా, అబ్దుల్ రహీం సంసుద్దీన్ - ఐటీసీ ఇన్ఫోటెక్, ఎండి. జోషువా డేవిడ్ - ఎంఫసిస్, సినీ ప్రముఖులు సోమ సుందరం, లాస్య, ఎం జయచంద్ర, వివిధ రంగాలలో అత్యుత్తమ స్థాయిలో నిలిచిన కళాశాల పూర్వపు విద్యార్థులు కృష్ణ కాంత్, మైనుద్దీన్ షేక్, కే భాస్కర్ రాజు, శ్రీనివాసులు, ఏ విక్రం లను అన్నమాచార్య యూనివర్సిటీ రెసోనన్స్ అవార్డ్స్(ఏ.యు.ఆర్.ఏ) అవార్డులతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ సి రామచంద్ర రెడ్డి, అన్నమాచార్య ట్రస్ట్ వైస్ చైర్మన్ శ్రీ. చెప్పా ఎల్లారెడ్డి, ప్రో ఛాన్సర్ శ్రీ అభిషేక్ రెడ్డి, విశ్వవిద్యాలయ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఎం.వి.నారాయణ, రిజిస్టార్ డాక్టర్ ఎన్ మల్లికార్జున రావు, డీన్లు, హెచ్వోడీలు మరియు అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్సీపీలో పలువురికి పదవుల పందేరం

విశాలాంధ్ర-నందలూరు: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నందలూరు మండలానికి చెందిన పలువురికి వైయస్ఆర్సీపీ పార్టీలో పదవులు లభించాయి. వైఎస్సార్సీపీ లీగల్ విభాగం జిల్లా అధ్యక్షులుగా నాయనపల్లి అనుదీప్ జయసింహ,బూత్ కమిటీ జిల్లా అధ్యక్షునిగా నడివీధి సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా సిద్ధవరం గోపి రెడ్డి, ఆర్గనైజేషన్ సెక్రటరీగా గొబ్బిల త్రినాథ్‌ను నియమిస్తూ కేంద్ర కార్యాలయం తాడేపల్లి నుండి ఉత్తర్వులు అందాయన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ తమ సేవలను గుర్తించి ఈ పదవులను ఇచ్చిందన్నారు. పార్టీ అభివృద్ధి కోసం తమ వంతు కృషి చేస్తామన్నారు.ఈ నియామకానికి సహకరించిన రాజంపేట శాసనసభ్యులు ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు మేడ రఘునాథ రెడ్డి, రాజంపేట అసెంబ్లీ ఇంచార్జ్ ఆకేపాటి అనిల్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

వైయస్సార్సీపి బలోపేతం కోసం అహర్నిశలు కృషి

విశాలాంధ్ర-రాయచోటి:అన్నమయ్య జిల్లాలో బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తామని అన్నమయ్య జిల్లా వైసీపీ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్, మున్సిపల్ విభాగం అధ్యక్షుడు ఫయాజుర్ రెహ్మాన్ అన్నారు. వైయస్సార్సీపి వీరి సేవలను గుర్తించి ఈ పదవులలో నియమించింది. ఈ సందర్భంగా బేపారి మహమ్మద్ ఖాన్ కార్యాలయంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ వైయస్సార్సీపిలోని ప్రతి కార్యకర్తను సమన్వయం చేసుకుంటూ కార్యకర్తలకు అండగా ఉంటూ పార్టీని బలోపేతం చేయడానికి అహర్నిశలు కృషి చేస్తామని తెలిపారు. పార్టీకి తాము చేసిన సేవను గుర్తించి తిరిగి ఈ పదవులు ఇవ్వడం పట్ల మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రాజంపేట పార్లమెంటు సభ్యుడు మిథున్ రెడ్డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి జిల్లా అధ్యక్షుడు అమర్నాథ్ రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వైసిపి కార్యకర్తలు నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదని కార్యకర్తలు అందరూ చైతన్యవంతులు కావాలని రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి అందరం పనిచేస్తామని పిలుపునిచ్చారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఎంతో ఉపయోగకరం

ఎస్టీయు రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణా రెడ్డి

విశాలాంధ్ర -కలసపాడు: పదవ తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం ఎస్టీయు రూపొందించిన స్టడీ మెటీరియల్ ఎంతో ఉపయోగకరమని ఎస్టీయు రాష్ట్ర అదనపు ప్రధానకార్యదర్శి పి.రమణారెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని ఎగువరామాపురం, కలసపాడు బాలురు మరియు బాలికలు, కెజిబివి, శంఖవరం జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాలల యందలి సుమారు 200 మంది పదవ తరగతి విద్యార్థులకు రాజుపాలెం పాఠశాల ఉపాధ్యాయుడు కె.వెంకటసుబ్బారెడ్డి దాతృత్వంతో స్టడీమెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సంధర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో చదివే పదవ తరగతి విద్యార్థుల కోసం రాష్ట్రంలోనే పేరొందిన సబ్జక్టు నిపుణులచే ఎస్టీయు స్టడీ మెటీరియల్ రూపొందించామన్నారు. ఈ మెటీరియల్ అన్ని సబ్జెక్టులలో చాప్టర్ల వారీగా వెయిటేజ్ ప్రకారం ప్రశ్నలను పొందుపరుస్తూ రూపొందించడం జరిగిందని తెలిపారు. విద్యార్థులు ఈ మెటీరియల్ చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.వెంకటరెడ్డి, బి.ఎస్వీ.ప్రసాద్ లు మాట్లాడుతూ ఎస్టీయు కేవలం ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలోనే కాక సమాజసేవలో సైతం తనవంతు సేవలు అందిస్తుందన్నారు.ప్రభుత్వం కూడా ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో చాలా నిర్లిప్తంగా ఉందన్నారు. వెంటనే 30 శాతం ఐఆర్ ప్రకటించడంతో పాటు పెండింగులో ఉన్న బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మెటీరియల్ పంపిణీ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మెర్సీమాలిని, బ్రహ్మారెడ్డి, సలోమి సత్యవతి, రెడ్డిజ్యోతి, క్రిష్ణానాయక్‌లు, ఎస్టీయు నాయకులు శేఖర్ బాబు, కస్తూరి శ్రీనివాసులు, కె.వి.సత్యనారాయణ, జోగారావు, బేబీసరోజ, మస్తాన్, మహబూబ్ చాంద్ తదితరులు పాల్గొన్నారు.

డయల్ యువర్ డిఎం కార్యక్రమం

విశాలాంధ్ర - బద్వేలు : ఏపీఎస్ఆర్టీసీ బద్వేల్ డిపోలో ప్రజలకు ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రజలందరి సూచనలు సలహాలు స్వీకరించేందుకు గురువారం డయల్ యువర్ డిఎం కార్యక్రమము నిర్వహిస్తున్నట్లు బద్వేల్ డిపో మేనేజర్ నిరంజన్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 11 గంటల నుండి 12 గంటల వరకు డయల్ యువర్ డిఎం ప్రోగ్రాం ఏర్పాటు చేసినట్లు ప్రయాణికులు 9959225779 అనే నెంబర్ కు డయల్ కానీ వాట్సాప్ మెసేజ్ గాని చేయవలసిందిగా కోరారు.

అర్జీదారుల సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం చేయరాదు

కడప కుడ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మెన్ ముక్కారూపానందరెడ్డి

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : రెవిన్యూ సమస్యల పరిష్కార వేదిక రెవిన్యూ సదస్సులో ప్రజలు ఇచ్చే అర్జీలను స్వీకరించి పరిశీలించి నిర్లక్ష్యం చేయకుండా తక్షణం పరిష్కరించాలని కడప కుడ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మెన్ టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జి ముక్కారూపానందరెడ్డి రెవిన్యూ అదికారులను అదేశించారు.బుధవారం ఓబులవారిపల్లి మండలంలోని గొబ్బూరువారిపల్లి, చిన్నంపల్లి గ్రామపంచాయతీలోని గ్రామసచివాలయ పరిధిలో తహశీల్దార్ శ్రీధర్ అధ్వర్యంలో జరిగిన రెవిన్యూ సదస్సు జరిగింది. ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీ దారులు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. రెవిన్యూ అధికారుల నిర్లక్ష్యం వలన నియోజకవర్గంలో 90 శాతం రెవెన్యూకు సంబంధించిన భూ సమస్యలే ఉన్నాయన్నారు. రెవిన్యూ సమస్యలు పరిష్కరించ కుండా నిర్లక్ష్యం చేస్తే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు పోతామన్నారు. రెవిన్యూ సిబ్బంది పనితీరులో ప్రోగ్రేస్ కనిపించాలన్నా రు. రెవిన్యూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రెవిన్యూ సదస్సులను ప్రవేశపెట్టిందన్నారు. నియోజకవర్గ అధ్యక్షులుగా ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన భాధ్యత నాపైన ఉందన్నారు. రెవిన్యూ సదస్సు లకు వచ్చిన అర్జీలన్నింటిని నిర్ణత గడువు లోపల పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ప్రజల నుండి వచ్చిన అర్జీలను ఎంత వరకు పరిష్క రించారో, ఎందుకు పెండింగ్ పెట్టారో ప్రతినెలా సమీక్ష సమావేశం చేపడతామన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ డిఇఇ ఎం.మహే శ్వర,పంచాయితీ రాజ్ ఎఇ ఆంజనేయప్రసాద్, తెలుగుదేశంపార్టీ నాయకులు పొన్నాటి వాసుదేవరెడ్డి,ముక్కా సాయివికాస్ రెడ్డి,బత్తిన వేణుగోపాల్ రెడ్డి, తమెదపాటి తిరుపాలు, సింగమాల మల్లిఖార్జున రెడ్డి, మహేంధర్ రెడ్డి, పిఎస్ వేణు, గొబ్బూరువారిపల్లి, చిన్నంపల్లి, గ్రామపంచాయితీ సెక్రటరీ సాయితేజ,విఆర్ఓ పీరయ్య,స్థానిక కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

విశాలాంధ్ర-రామాపురం: గ్రామాలలో భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రెవెన్యూ సదస్సులో చేపట్టిందని తాసిల్దార్ రామాంజనేయులు అన్నారు.చిట్లూరులో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో భూ సమస్యలు ఉన్న పరిష్కరించుకోవడానికి ప్రజలు రెవిన్యూ సదస్సను వినియోగించుకోవాలన్నారు. భూమి కొలతలు తక్కువఉన్న ఆన్లైన్ సమస్యలు ఉన్న రిసర్వే లో భూమి తక్కువ చూపించిన వన్‌బి అడంగల్ ఇతర సమస్యలున్న ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. ఈ సమావేశంలో ప్రత్యేక అధికారి మని, దేవదాయశాఖ అధికారి అధికారి విశ్వనాధ్, టిడిపి నాయకులు సురేంద్ర రెడ్డి, దేవదర్శన్ రెడ్డి, చిన్న కృష్ణారెడ్డి, రామకృష్ణ గౌడ్, తుమ్మల ఓబులేసు, ప్రభాకర్, లక్ష్మయ్య, మానిటింగ్ విజిలెన్స్ కమిటీ సభ్యులు గంప వెంకటరమణ, అధికారులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఒంటిమిట్టలో 11 నుంచి ఉరుసు ఉత్సవాలు

విశాలాంధ్ర - ఒంటిమిట్ట : ఒంటిమిట్టలో ఈనెల 11వ తేదీ నుంచి హజరత్ సయ్యద్ సాదిక్ వల్లి సాహెబ్ ఉరుసు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 11వ తేదీ గంధం 12 వ తేదీ ఉరుసు ఖవాలి నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 12వ తేదీన ఉరుసు రోజున టిడిపి నాయకులు ఎస్వి రమణ గజ్జల నరసింహారెడ్డి రమణ నాయుడు ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ఉత్సవాలకు భక్తులుపాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

స్కానింగ్ బిడ్డ ఎదుగుదలను తెలుసుకొనుటకు మాత్రమే

విశాలాంధ్ర-జమ్మలమడుగు : స్కానింగ్ సెంటర్లు కేవలం బిడ్డ ఎదుగుదలను తెలుసుకొనుటకు మాత్రమే అని ఉప జిల్లా వైద్యాధికారి డాక్టర్. శివ ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం రమేష్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, సాయి నర్సింగ్ హెూమ్ లను సందర్శించి తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శివప్రసాద్ మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు స్కానింగ్ సెంటర్స్ నందు చేయటం నేరమన్నారు. బిడ్డ ఎదుగుదల మరియు లోపాలను గుర్తించుటకు మాత్రమే అని అన్నారు. మగ,ఆడ లింగ నిర్ధారణకు కాదన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ సెంటర్ కు రూ.50,000 జరిమానా విధిస్తామని తెలిపారు. అలాగే డాక్టర్ కు ఉన్న సర్టిఫికెట్లను రద్దు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కోదండ రామాలయ జీర్ణోద్ధరణ పనులు వేగవంతం చేయాలి

విశాలాంధ్ర - ఒంటిమిట్ట : ఒంటిమిట్ట కోదండ రామాలయ మరమ్మత్తు పనులు వేగవంతం చేయాలని స్పెషలాఫీసర్ మాలతి అధికారుల ఆదేశించారు. కోదండ రామాలయ మనుమత్తు పనులను బుధవారం ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏప్రిల్ లో జరిగే కోదండరామాలయం బ్రహ్మోత్సవాలకు మరమత్తు పనులు పూర్తి చేయాలని కోరారు.

మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం : ఎంపీపీ మేడ

విశాలాంధ్ర-నందలూరు: మండలాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి పరచి ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎంపీపీ మేడ విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎంపీడీవో రాధా కృష్ణ అధ్యక్షతన మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీపీ మేడ విజయ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ మండల అభివృద్ధి కొరకు ప్రతి అధికారి, ప్రజా ప్రతినిధులు సహకరించాలని కోరారు. అనంతరం మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు నాయనపల్లి అనుదీప్, తుమ్మల భావన, మండల కో ఆప్షన్ సభ్యులు కరిముల్లా ఖాన్, ఎంపీటీసీలు సోమిశెట్టి సునీత, రమేష్ రెడ్డి, సుభాన్ భాష, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం

విశాలాంధ్ర-రామాపురం : రాయచోటి చిన్న ముక్కపల్లి మురికినాటి రెడ్డి కిషోర్ రెడ్డి సుచరిత దంపతుల కుమార్తె హేమశ్రీ రెడ్డి 2వ పుట్టినరోజు సందర్భంగా ప్రేమాలయం వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు జోన్ చైర్మన్ షేక్ మహమ్మద్ తెలిపారు. అనంతరం దాతలు మురికినాటి రెడ్డి కిషోర్ రెడ్డి, సుచరిత దంపతులు మాట్లాడుతూ మా కుమార్తె హేమశ్రీ రెడ్డి 2 వ పుట్టినరోజు సందర్భంగా ప్రజలకు ఉపయోగపడే సేవ చేయాలనే ఉద్దేశంతోనే ఈ రోజు ప్రేమాలయం వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలొ డిస్ట్రిక్ట్ చైర్మన్ లయన్ వి.హరీష్ చంద్ర, దాత కుటుంబ సభ్యులు మహేశ్వర్ రెడ్డి, శ్రీవాణి,హరీష్, వేణుగోపాల్ రెడ్డి,సుశీల, వృద్ధాశ్రమం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లా బీసీ సెల్ అధ్యక్షులుగా గురుశేఖర్

విశాలాంధ్ర- రామాపురం: మండలంలోని కల్పనాయుని చెరువు చెందిన కొండబోయిన గురుశేఖర్ బుధవారం తంబళ్లపల్లి టీడీపీ కార్యాలయంలో అన్నమయ్య జిల్లా బీసీ సెల్ అధ్యక్షునిగా నియామక పత్రాన్ని అన్నమయ్య జిల్లా అధ్యక్షులు జగన్మోహన్ రాజు రాష్ట్ర రవాణా క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్ర యాదవ్ నియామక పత్రాన్ని అందుకున్నట్లు తెలిపారు. అన్నమయ్య జిల్లా బీసీ సెల్ అధ్యక్షునిగా పదవి ఇచ్చినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేయూత ఉపాధ్యక్షులు మహేష్‌లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌లో అన్నమయ్య జిల్లా విజయకేతనం

విశాలాంధ్ర-రాయచోటి:ఈ నెల 7,8 తేది లలో విజయ వాడలోని మురలి రిసార్ట్స్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌లో అన్నమయ్య జిల్లా నుండి రెండు ప్రాజెక్టులు రాష్ట్ర విజాతులగా నిలిచాయని జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి తెలిపారు. ఈ పోటీలలో అన్నమయ్య జిల్లా నుండి 6 ప్రాజెక్ట్ లను ప్రదర్శించగా రెండు ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయి విజేతలుగా నిలిచి సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌కు ఎంపికయ్యాయని ఆయన తెలిపారు. టీచర్ విభాగం నుండి చిట్వేల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన శివ నారాయణ గౌడ్ రూపొందించిన ప్లాస్టిక్ వ్యర్థాల నుండి కాపర్ కోటెడ్ బాటిల్ అను ప్రాజెక్టు, గ్రూపు విభాగము నుండి కలకడ మోడల్ స్కూల్ కు చెందిన మహమ్మద్ సుహేల్ రెహాన్ రూపొందించిన బయో ఎంజైమ్స్ ప్రాజెక్టు రాష్ట్రస్థాయి విజేతలుగా నిలిచాయి. గ్రూపు ప్రాజెక్టుకు సుమతి గైడ్ టీచర్ గా వ్యవహరించారు. సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస రావు,ఎస్ సి ఈ ఆర్ టి డైరెక్టర్ వెంకట కృష్ణా రెడ్డి,విశ్వేశ్వరయ్య యూనివర్సిటీ ప్రొఫెసర్ పురుషోత్తం చేతుల మీదుగా వీరు మెమెంటో, సర్టిఫికెట్ లను అందుకున్నారు. ఈనెల 20 నుండి 25 వ తేదీ వరకు పాండిచేరిలో నిర్వహించే దక్షిణ భారత దేశ సైన్స్ ప్రదర్శనలో వీరు పాల్గొననున్నారని తెలిపారు. విజేతలను గైడ్ టీచర్లను జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం, ఉప విద్యాశాఖాధికారి శివ ప్రకాష్ రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి,ప్రధానోపాధ్యాయులు బాల నాగేంద్ర ప్రసాద్, ప్రిన్సిపల్ మలామ్ షా వలి విజేతలను గైడ్ టీచర్లను అభినందించారు.

ఏఐటీయూసీలో పలువురు చేరిక

విశాలాంధ్ర-యర్రగుంట్ల :ఆర్టీపీపీ స్టేజ్-4 యాష్ హ్యాండ్లింగ్ ప్లాంటులో పనిచేస్తున్న సుమారు 63 మంది కాంట్రాక్టు కార్మికులు బుధవారం ఏఐటీయూసీ అను బంధ ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్‌యూనియన్‌లో చేరారు. వీరికి యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పొన్నా శివయ్య కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు నారుబోయిన రాము, సాంబశివారెడ్డి, శివన్న, దస్తగిరి పాల్గొన్నారు.

ముగిసిన రెవిన్యూ సదస్సులు

విశాలాంధ్ర-సుండుపల్లె :మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో రెవిన్యూ సదస్సు ప్రత్యేక అధికారి జయ రాముడు అక్కంపల్లి గ్రామసదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రజలు సమస్యలతో తీర్చేందుకు అరవింద సదస్సులు ఉపయోగపడతాయని వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ రెడ్డెన్న మాట్లాడుతూ వచ్చిన అర్జీలు పరిశీలించి పరిష్కరిస్తామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ జయరాముడు, డిప్యూటీ తహసీల్దార్ రెడ్డెన్న, మండలసర్వేయర్ వెంకటసుబ్బయ్య, వి ఆర్ ఓ బసయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఐసిడిఎస్, వైద్యారోగ్య శాఖ లక్ష్యాలలో చిత్తశుద్ధితో ప్రగతి సాధించాలి : జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి

విశాలాంధ్ర-రాయచోటి: మహిళా శిశు సంక్షేమం, ప్రజల ఆరోగ్య సంరక్షణ అంశాలలో రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలలో చిత్తశుద్ధితో ప్రగతి సాధించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఐసిడిఎస్, వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్ నుండి ఐసిడిఎస్ సిడిపివోలు, సూపర్వైజర్లు అంగన్వాడీలు, వైద్యారోగ్య శాఖ మెడికల్ అధికారులు, సిబ్బందితో ఆయా శాఖల అంశాలలో సాధించిన ప్రగతి, సాధించాల్సిన ప్రగతి, ఏయే అంశాలలో వెనుకబడి ఉన్నారు, అందుకు గల కారణాలు తదితరాలలో కలెక్టర్ సమీక్షించి తగు సూచనలు జారీ చేశారు. మొదట ఐసిడిఎస్ శాఖకు సంబంధించి పోషన్ ట్రాకర్ డైలీ మానిటరింగ్, ఇమేజ్ క్యాప్చరింగ్, పిల్లల హాజరు, పోషన్ ట్రాకర్ హౌస్ విజిట్స్, బాల సంజీవిని, బాలామృతం, పాలు, కోడిగుడ్ల పంపిణీ తదితర అంశాలలో సూపర్వైజర్స్, సిడిపిఓల పనితీరుపై సమీక్షి. లక్ష్యాలలో వెనుకబడిన వారిని కారణాలు అడిగి తెలుసుకుని, తీసుకోవాల్సిన చర్యలపై తగు సూచనలు జారీ చేశారు. అంగన్వాడీ కేంద్రాలలో మరుగుదొడ్లు తాగునీరు, విద్యుత్ కనెక్షన్స్ తదితర అంశాలలో సమీక్షించారు. వివిధ అంశాలలో శ్రద్ధ పెట్టి లక్ష్య సాధనకు కృషి చేయాలని మెడికల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఆర్ బి ఎస్ కే స్కూల్ హెల్త్ స్క్రీనింగ్, ఎన్ సిడి 3.0, ఆర్ సి హెచ్ ప్రోగ్రాం, పిడబ్ల్యు అబా లింకేజ్ ప్రోగ్రాం, అన్మోల్, అనీమియా మానిటరింగ్ తదితర అంశాలలో మెడికల్ అధికారులతో సమీక్షించారు. ఏఎన్ఎం తరచు పాఠశాలలను సందర్శించి వైద్య సేవలు అందించాలన్నారు. జీరో శాతం ప్రగతి ఉన్నవారు మూడు రోజుల లోపల ప్రగతి సాధించకపోతే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డిఎంహెచ్వోను ఆదేశించారు. అలాగే ప్రతి మంగళవారం జూన్ మీటింగ్ ద్వారా ఆయా అంశాలలో లక్ష్యాలను సమీక్షించాలని సూచించారు. అనంతరం వివిధ అంశాలలో తమ సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లాలో కుష్టి వ్యాధి గ్రస్తులను గుర్తించే కార్యక్రమానికి సంబంధించిన ప్రచార పోస్టర్లను వైద్యశాఖ అధి కారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో డిఎంహెచ్వో, ఐసిడిఎస్ పిడి, వైద్యాధికారులు, సిడిపివోలు, ఏఎన్ఎంలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుండాలకోన రోడ్డుకు మోక్షం :భూమి పూజ చేసిన చైర్మెన్

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : నియోజకవర్గం ఓబులవారిపల్లి మండల పరిధిలోని వైకోట గ్రామపంచాయతీలోని పవిత్ర పుణ్యక్షేత్రం అయిన గుండాలకోన కడప కుడా డెవలప్మెంట్ అథారిటీ చైర్మెన్ తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ముక్కారూపానందరెడ్డి కృషితో గుండాలకోన రోడ్డుకు మోక్షం లభించింది. సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకుగాను బుధవారం రూపానందరెడ్డి ఘనంగా భూమి పూజ చేశారు. గుండాలకోనకు రోడ్డు నిర్మాణం కోసం ఎంతో మంది నాయకులు ప్రయత్నం చేసి విఫలం అయ్యారు.వైకోట తెలుగుదేశం పార్టీ నాయకులు గుండాలకోన రోడ్డు విషయం రూపానందరెడ్డి దృష్టికి తీసుకుపోవడంతో తక్షణం స్పందించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి, డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకుపోయి పట్టు వదలని విక్రమార్కుడులా సాదించారని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్లేసి గెలిపించిన ప్రజలకు న్యాయం చేయాల్సిన ప్రధాన భాధ్యత తనపై ఉందన్నారు. ప్రజల రుణం తీర్చుకోలేనన్నారు. 2024 ఎన్నికలలో తాను ఎంపిక చేసిన కూటమి అభ్యర్థి అరవ శ్రీధర్‌ను గెలిపించారన్నారు. సిఎం, డిప్యూటీ సీఎం చొరవతో గుండాలకోన రోడ్డు నిర్మాణానికి 2 కోట్ల రూపాయలు మంజూరు అయిందన్నారు.2600 మీటర్లు సిమెంట్ రోడ్డు నిర్మిస్తారన్నారు. 26 ఫిబ్రవరి 2025 న బుధవారం జరిగే మహాశివరాత్రి పండుగకు గుండాలకోన కు వెళ్లే భక్తులకు ప్రయాణం సులభంగా ఉంటుందన్నారు. మనం అందరం ముఖ్యమంత్రి కి, డిప్యూటీ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపాలన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తాతంశెట్టి నాగేంద్ర, పగడాల వెంకటేష్, చంద్రశేఖర్, పొన్నాటి వాసుదేవరెడ్డి, కమతం నాగరాజు, బత్తిన వేణుగోపాల్ రెడ్డి సింగమాల మల్లిఖార్జున రెడ్డి, మహేంధర్ రెడ్డి, పిఎస్ వేణు, గంగరాజు వెంకటేశ్వరరాజు, పిఆర్ ఎఇ ఆంజనేయప్రసాద్, బొక్కసం చలపతి, సునీల్, బిల్లా కృష్ణమూర్తి, బజారు సుబ్రమణ్యం, అడపాల బాలాజీ, కట్టా గుండయ్యనాయుడు, తల్లెం రమణారెడ్డి, సీడీ నాగేశ్వరయాదవ్, తదితరులు పాల్గొని పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు.

జి.ఎం.ఆర్ ఎంప్లాయిడ్ ఓల్డ్ స్టూడెంట్ వెల్ఫేర్ సొసైటీ సేవలు అభినందనీయం

విశాలాంధ్ర-కడపకార్పొరేషన్ : పెళ్లిళ్లు ఆర్థిక సహాయం, అనారోగ్య బారిన పడినవారికి వైద్య ఖర్చులు, అవసరమైన వారికి రక్తదానం, అన్నదానం వంటి సేవ కార్యక్రమాలు జి.ఎం.ఆర్ ఎంప్లాయిడ్ ఓల్డ్ స్టూడెంట్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా చేయడం గొప్ప విషయమని బిజెపి జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్ రెడ్డి అన్నారు. జి.ఎం.ఆర్ పాలిటెక్నిక్ కాలేజీలో చదివిన పూర్వ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం చక్కటి వేదికగా ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. బుధవారం కడప బిజెపి కార్యాలయంలో జి.ఎం.ఆర్ ఎంప్లాయిడ్ ఓల్డ్ స్టూడెంట్ వెల్ఫేర్ సొసైటీ రూపొందించిన నూతన క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విలేకరులతో శశిభూషణ్ రెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థుల చదువు కోసం 1987లో అప్పటి సీఎం ఎన్టీఆర్ శ్రీశైలం, మదనపల్లెలో రెండు పాలిటెక్నిక్ కాలేజీలు ప్రారంభించారని గుర్తు చేశారు. 1988వ సంవత్సరం ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ నేను (శశి భూషణ్ రెడ్డి) మదనపల్లిలో జిఎంఆర్ పాలిటెక్నిక్ కాలేజీలో చేయడం జరిగిందని గుర్తు చేసుకున్నారు. అక్కడ చదివిన పూర్వ విద్యార్థులు అందరూ కలిసి పేద విద్యార్థులకు కోసం ఆర్థిక, ఆరోగ్యకరమైన సమస్యల పరిష్కారం కోసం కోసం పలుసేవ కార్యక్రమాలు చేపట్టడం అదిరిందినిమన్నారు. కార్యక్రమంలో జి.ఎం.ఆర్ ఎంప్లాయిడ్ ఓల్డ్ స్టూడెంట్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు రాజారావు, కన్వీనర్ నిత్య, కో కన్వీనర్ ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ నాగేశ్వరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

బీరం శ్రీధర్ రెడ్డి పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - ఖాజీపేట /చెన్నూరు : కడప జిల్లా ఖాజీపేట మండల పరిధిలోని బీరం శ్రీధర్ రెడ్డి పాఠశాలలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని బుధవారం ముందస్తుగా సంక్రాంతి సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. పండుగ సంబరాలలో ఆడపిల్లలు కోలాటాలు, గొబ్బెమ్మలతో కూడిన ముగ్గులు, హరిదాసు కీర్తనలు, భోగిమంటలు, గాలిపటాల రెపరెపలు, ఎద్దుల బండ్లు, బొమ్మల కొలువులు, పొంగళ్ల పరమాన్నాలు, పిండి వంటల ప్రదర్శనలు, ఒక మోస్తారు పల్లెటూర్లను తలపించే విధంగా పాఠశాల ప్రాంగణమంతా సంక్రాంతి పండగ ఉత్సవాలతో కనులు విందు చేశారు. ఈ సందర్భంగా కడప జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు, బీరం విద్యాసంస్థల అధినేత బీరం సుబ్బారెడ్డి, చైర్ పర్సన్ సరస్వతమ్మ మాట్లాడుతూ మా పాఠశాల ఆవరణలో ముందస్తు సంక్రాంతి సంబరాలు చేసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. అలాగే ప్రదర్శనలు అనేవి పిల్లలకు చిన్నతనం నుండే ప్రతి రంగంలోను ఆసక్తిని పెంపొందించిందికే పిల్లలతో ప్రదర్శనలు పెట్టించామన్నారు. అదేవిధంగా కార్యక్రమంలో ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ఇచ్చామన్నారు. కోలాటాలు, డాన్సులతో ప్రాంగణమంతా సంక్రాంతి సంబరాలలో సందడి సందడి చేశారన్నారు. ముందస్తు సంక్రాంతి సంబరాలలో బీరం శ్రీధర్ రెడ్డి పాఠశాల ప్రిన్సిపల్ శ్వేత, కళాశాల ప్రిన్సిపల్ హేమ్ చందర్, అధ్యాపకులు,పి.ఇ.టి లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిఎంసి రిమ్స్‌లో బిఇజిఎన్ఎం థియరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నాం

వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.సురేఖ



విశాలాంధ్ర-కడప : పరీక్షా హాలు గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ కడప నందు బిఇజిఎన్ఎమ్ థియరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ.సురేఖ వెల్లడించారు.ఈ పరీక్షలు ఈనెల మూడవ తారీకు నుంచి 11 వ తారీకు వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు .పరీక్షలు సునీతమైన ఇన్విజిలేటర్లు మరియు సూపరిండెంట్ల ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన ప్రమాణాల మధ్య నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలకు జిల్లా నలుమూలల నుంచి ప్రైవేటు కళాశాలల విద్యార్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. కళాశాలల యాజమాన్యం మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పరీక్ష జరిగే హాలులకు అనుమతించబడరన్నారు. ఈ పరీక్షలకు ఎన్టీఆర్ యూనివర్సిటీ విజయవాడ నుంచి మరియు డిఎంఈ విజయవాడ నుంచి స్పెషల్ అబ్జర్వర్లు నియమింపబడినట్లు తెలిపారు. విద్యార్థులు పరీక్షలలో మాల్ ప్రాక్టీస్ కు పాల్పడినట్టు రుజువైతే కఠిన చర్యలు తప్పమన్నారు.

మద్యం మత్తులో మురుగు కాల్వలో పడి వ్యక్తి మృతి

విశాలాంధ్ర - మైదుకూరు : చాపాడు మండలం పల్లవోలు గ్రామంలో మద్యం మత్తులో బుధవారం సాయంత్రం మురుగు కాల్వలో పడి వ్యక్తి మృతి. పల్లవోలు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు అనే వ్యక్తి మద్యం సేవించి ఇంటి ఎదురుగా ఉన్న అరుగుపై నిద్రిస్తుండగా ప్రమాదవశాత్తు పక్కనున్న మురుగు కాల్వలో పడిపోయాడు. కాసేపటికి స్థానికులు చూసి వ్యక్తిని కాల్వ నుంచి బయటకి తీశారు. సీపీఆర్ చేసినా ఫలితం లేకపోవడంతో ప్రొద్దుటూరులోని ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఇంటి వద్దే కాల్వలో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు.

నాగార్జున మోడల్ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-కడపకార్పొరేషన్:నగరంలోని మారుతీ నగర్ లో ఉన్న నాగార్జున మోడల్ స్కూల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి పండగ వాతావరణాన్ని తీసుకువచ్చారు. విద్యాసంస్థల చైర్మన్ ఎం.శివశంకర్ రెడ్డి, డైరెక్టర్లు ఎం.శ్రీదేవి, భానేష్ సాయి రెడ్డి సంబరాలను ప్రారంభించారు. రంగవల్లులు, గొబ్బెమ్మలుతో పాఠశాల ప్రాంగణం పండగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా చైర్మన్ శివశంకర్ రెడ్డి మాట్లాడుతూ భోగి, సంక్రాంతి, కనుమ పేర్లతో మూడు రోజులు పండుగ చేసుకుంటారని తెలిపారు.పండుగలు ఐక్యతకు చిహ్నాలని చెప్పారు. చిన్నారులపై భోగి పళ్ళు వేసి ఆశీర్వదించారు. కొందరు విద్యార్థులు హరిదాసు గంగిరెద్దు వేషాలు వేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి డిడిఓగా గౌరీప్రియ

విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్ : పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రమైన 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రి డిడిఓగా ఇదే ఆసుపత్రిలో అప్తమాలజిస్టగా విధులు నిర్వహిస్తున్న యువడాక్టర్ ఎ. గౌరీ ప్రియను ప్రభుత్వం డిడిఓ (సూపర్నెంట్ డాక్టర్)గా నియమించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ఆసుపత్రిలో డాక్టర్లు, సిబ్బంది కొరత ఉందని, రిక్వైర్ మెంట్ కూడా లేదన్నారు. ఓపి 300 వరకు ఉంటోందన్నారు. డాక్టర్లు అందరూ వేళకు వచ్చేలాగ చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం ఏడుగురు డాక్టర్లు మాత్రమే వున్నారని, ఇంకా అనస్టీసియా, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ డాక్టర్లు అవసరముందన్నారు. మాపై నమ్మకంతో వస్తున్న గ్రామీణ పేద ప్రజలకు మరింత మెరుగయిన సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు.

ఏపీ రైతు సంఘం నూతన క్యాలెండర్ విడుదల

విశాలాంధ్ర-కడప రూరల్ : ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం 2025 నూతన సంవత్సర క్యాలెండర్ను మండల వ్యవసాయ అధికారి శ్యాం బాబు బుధవారం కొమ్మది గ్రామంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ రైతు సంఘం రైతులను చైతన్యం చేస్తూ వివిధ కార్యక్రమాలను రూపొందించడం అభినందనీయం అన్నారు.రైతులకు సంబంధించిన వివిధ చిత్రాలతో ప్రతి సంవత్సరం క్యాలెండర్‌ను ముద్రించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కొమ్మది విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ గురు ప్రసాద్ నాయక్, ఏపీ వీఆర్ఏ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్మది ఈశ్వరయ్య, రైతులు లక్ష్మీరెడ్డి, నాగార్జునరెడ్డి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి..రూ 5 లక్షల కంచె అన్యాయంగా తొలగించారని బాధితుడి ఆవేదన

విశాలాంధ్ర-రాజంపేట : రూ 5 లక్షలు ఖర్చు చేసి తన పట్టా భూమిలో వేసుకున్న కంచెను రెవెన్యూ అధికారులు ముందస్తు నోటీసులు కూడా ఇవ్వకుండా అన్యాయంగా తొలగించారని మండల పరిధిలోని చిన్నిల్లుగారి పల్లెకు చెందిన యువరైతు రఘునాథ రెడ్డి తనకు న్యాయం చేయండి సారూ... అంటూ ఆవేదన చెందారు. బుధవారం బాధితుడు రఘునాథరెడ్డి పాత్రికేయులను ఆశ్రయించి తనకు జరిగిన అన్యాయం గురించి వివరించారు. పోలి రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 1212లో తన తండ్రి పేరిట ఉన్న 5.5 ఎకరాల పట్టా భూమిలో కొంత డీకేటీ భూమి ఉందన్నారు. ఇటీవల ఆ భూమిలో రూ. 5 లక్షలతో కంచె ఏర్పాటు చేసుకుంటే మొదట రోడ్లు, భవనాల శాఖ ఇబ్బందులకు గురి చేశారన్నారు. తదుపరి వంతుగా రెవెన్యూ అధికారులు తన భూమి కొంత భాగం ప్రభుత్వాధినంలోని భూమిలోకి వచ్చిందని, ఏర్పాటు చేసుకున్న కంచెను తొలగించాలని సూచించినట్లు తెలిపారు. అదే విషయం లిఖితపూర్వకంగా ఇస్తే తాను తొలగించడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపినా పట్టించుకోలేదన్నారు. రెండు నెలలు పని ఆపి ఎదురు చూసినా రెవిన్యూ అధికారులు నిర్లక్ష్యం చేశారన్నారు. తీరా కంచె వేసుకున్నాక ముందస్తు నోటీసులు కూడా ఇవ్వకుండా బుధవారం తహసీల్దార్ పీరు మున్నీ, ఆర్ఐ శేషం రాజు, విఆర్ఓ సుధాకర్, సర్వేయర్ దామోదర్ రెడ్డి సిబ్బందితో కలిసి జేసీబీతో దౌర్జన్యంగా కంచె తొలగించారని ఆవేదన చెందారు. తనకు రూ 5 లక్షలు నష్టం వాటిల్లిందని, తనకు జరిగిన అన్యాయంపై కలెక్టర్‌ను కలిసి న్యాయం చేయమని కోరనున్నట్లు తెలియజేశారు.

ప్రభుత్వ భూమిలోని కంచె మాత్రమే తొలగించాం

ఈ ఘటనపై తాసిల్దార్ పీరు మున్నీ ని వివరణ కోరగా.. కేవలం ప్రభుత్వ భూమిలోకి చొరబడిన కంచె మాత్రమే తొలగించామని తెలిపారు. సాగులో ఉన్న భూములపై చర్యలు తీసుకునే సమయంలో మాత్రమే ముందస్తు నోటీసులు ఇవ్వడం జరుగుతుందని, రఘునాథ రెడ్డి ప్రస్తుతం కంచె వేస్తుండగా అడ్డుకున్నామని., పట్టా భూమిలో తాము జోక్యం చేసుకోలేదని తెలియజేశారు.

ఎస్టియు క్యాలెండర్ ను ఆవిష్కరించిన డిప్యూటీ ఇఓ,ఎంఇఓ

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టియు) అద్వర్యంలో ముద్రించిన 2025 సంవత్సరం క్యాలెండర్‌ను, 10 తరగతి స్టడీ మెటీరియల్స్ ను బుధవారం కోడూరు మండల విద్యాశాఖ అధికారి-2 డి సుందరంబాబు ఆవిష్కరించారు. పెనగలూరు ఎస్టియు మండల శాఖ అద్వర్యంలో ముద్రించిన 2025 సంవత్సరం క్యాలెండర్,డైరీ,జిఓ పుస్తకం, కాన్సెప్ట్ క్యాలెండర్,స్టిక్కర్ క్యాలెండర్,10 తరగతి స్టడీ మెటీరియల్స్‌ను నల్లపురెడ్డిపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో డిప్యూటీ ఇఓ ఆర్.రాజగోపాల్ రెడ్డి,సికె దిన్నె ఎంఇఓ ఎన్.వెంకట రామిరెడ్డి ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో కోడూరు ఎస్టియు మండల ప్రధాన కార్యదర్శి బాలగంగాధర్, జిల్లా మైనార్టీ కన్వీనర్ షేక్ మస్తాన్ భాష,జిల్లా వైస్ ప్రెసిడెంట్ కుమార్, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ పోకూరు బాలసుబ్రమణ్యం, సీనియర్ నాయకులు విక్రమ్ వర్మ, కృష్ణయ్య, రామకృష్ణ, జనార్దన్, మహిళా ఉపాద్యాయులు, ఉపాద్యాయ వాణి సంపాదకవర్గసభ్యులు గురుప్రసాద్, పెనగలూరు ఎస్టియు రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ పిల్లి రామకృష్ణ, ఉపాధ్యక్షులు యానాదయ్య, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ సి జయరామయ్య, జిల్లా కౌన్సిలర్లు ప్రభాకర్ రెడ్డి,పి నరసింహులు, మండల శాఖ అధ్యక్షులు ఎం శివరాం, ప్రధాన కార్యదర్శి కె మల్లిఖార్జున మరియు ఉపాధ్యాయ బృందం తదితరులు క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు :ఆర్డీవో చంద్రమోహన్

విశాలాంధ్ర- అట్లూరు: దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు బద్వేల్ రెవెన్యూ డివిజన్ అధికారి చంద్రమోహన్ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సదస్సులు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుం దన్నారు. ప్రజలు ఈ సదస్సులు వినియోగించుకుని భూ సమస్యలు పరిష్కరించుకోవాలని ఆర్డీవో సూచించారు. అట్లూరు మండలం కొండూరు గ్రామంలో ముగింపు చివరి రోజు బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మండల సీనియర్ నాయకులు నందగోపాల్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు అమర్నాథ్ రెడ్డి, సర్పంచ్ సుధా, తాసిల్దార్ సుబ్బలక్ష్మమ్మ, బద్వేల్ ఆర్డిఓ చంద్రమోహన్ తో కలిసి పాల్గొన్నారు.ఈ సమావేశంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ వెంకటరమణ, వీఆర్వోలు దొరబాబు, దస్తగిరి, వెంకట సుబ్బమ్మ, సర్వేయర్ సుబ్బారెడ్డి, నరసింహారెడ్డి, తెలుగు యువత అధ్యక్షులు జై కృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ రామకృష్ణారెడ్డి, అల్లం వెంకటసుబ్బయ్య, నాయకులు బద్వేల్ ఎస్సీ సెల్ అధ్యక్షులు కాకి రిషికేశవ, సీనియర్ నాయకులు ముని రెడ్డి, పరమేష్ యాదవ్ (బాబా) , సీనియర్ పాత్రికేయులు చిన్నపరెడ్డి,డీలర్ గంగిరెడ్డి, చిలిపి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంపచెట్లు తొలగింపు :సర్పంచ్ భర్త వేమిరెడ్డి ముని రెడ్డి

విశాలాంధ్ర-బ్రహ్మంగారిమఠం: మండల పరిధిలోని ముడమాల పంచాయతీలోని ఉన్న గ్రామాల వారిగా రోడ్లపై తుమ్మచెట్టు కంప చెట్లను యంత్రాలతో ముడుమాల సర్పంచ్, భర్త వేమిరెడ్డి ముని రెడ్డి తొలగించారు. మాట్లాడుతూ గ్రామాల చుట్టూ కంప చెట్లు నిండు ఉండడంతోవిషపురుగులు గ్రామాలలోకి చంచరిస్తూ ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని సంక్రాంతి పండగ సందర్భంగా కంప చెట్లు తొలగించే చేపట్టడం జరిగిందని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఆగిపోయిన రమణయ్య యాదవ్, మాజీ ఎంపిటిసి సభ్యులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ అధికారుల సమావేశం

విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్ : పోరుమామిళ్ల పట్టణ గ్రామపంచాయతీ అభివృద్ధికి, సమస్యలపై పంచాయతీ భవనంలో అధికారుల సమావేశం జరిగింది. ఈ సమావేశం పోరుమామిళ్ల పట్టణ మేజర్ పంచాయతీ సర్పంచి యనమల సుధాకర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో త్రాగు నీరు, పారిశుద్ధ్యం, పంచాయతీ నూతన భవనముల నిర్మాణం, కాంటాక్ట్ పద్ధతిలో పనిచేయుచున్న పిడబ్ల్యూఎస్ పారిశుద్ధ రైటర్స్ వారి కాలపరిమితి 31/3/2025 వరకు పొడిగించుట, పంచాయతీ మార్కెట్ రూముల వేలం, టోల్గేట్ గేటు టెండర్ ను 31/03/2025 పొడిగించుట పంచాయతీ అభివృద్ధికి అనేక అంశములను సమావేశంలో చర్చించామని సర్పంచ్ సుధాకర్ తెలిపారు. ఈ సమావేశంలో పంచాయతీ అధికారులు, వార్డ్ మెంబర్స్, పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అభివృద్ధి పథం వైపు నడిపిస్తున్న ఎన్డీయే ప్రభుత్వం

టిడిపి నేత మంచూరు సూర్యనారాయణ రెడ్డి

విశాలాంధ్ర -అట్లూరు : దేశ తూర్పు తీరానికి ప్రగతి హారాల్ల బాసిల్లే భారీ ప్రాజెక్టులు 2.08 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా శ్రీకారం చుట్టి ప్రధాని నరేంద్ర మోడీ సమక్షంలో, ముఖ్యమం త్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేశారు. నరేంద్ర మోడీ, చంద్రబాబు నాయుడు,పవన్ కళ్యాణ్ కలిసి విశాఖలో రోడ్ షో నిర్వహించి,భారీ బహిరంగ సభ నిర్వహించారు. పూరి మడక దగ్గర ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ హబ్ కి 1,85,000 కోట్లు విడుదల చేశారు. అదేవిధంగా విశాఖ దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రధాన కార్యాలయానికి 149 కోట్లు, రోడ్ల నిర్మాణం విస్తీర్ణంకు 4,593 కోట్లు,రైల్వే ప్రాజెక్టులు 6,028 కోట్లు, నక్కపల్లి దగ్గర బల్క్ డ్రగ్ పార్కుకి 1,877 కోట్లు,234.28 కిలోమీటర్ల రోడ్లకి 3,044 కోట్లు,323 కిలోమీటర్ల మూడు రైల్వే లైన్ల పనులకు 5,718 కోట్ల రూపాయల పనులను మంజూరు చేసి జాతికి అంకితం చేశారన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ఇలాంటి అభివృద్ధి పనులను మరిన్ని చేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని దేశంలోనే మొదటి స్థానం వచ్చేలాగా చేయాలని బద్వేల్ నియోజకవర్గం టీడీపీ ప్రజా నాయకుడు మంచూరు సూర్యనారాయణ రెడ్డి ఆకాంక్షించారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఉపాధి హామీ ఎపిడి ఆగ్రహం

విశాలాంధ్ర - వల్లూరు : ఉపాధి హామీ సామాజిక ప్రజావేదిక కార్యక్రమంలో భాగంగా అవకతవకలకు పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్ పై ఉపాధి హామీ ఎపిడి నాగరత్నమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం వల్లూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉపాధి హామీకి సంబంధించి సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 2023 2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలంలో నిర్వహించిన ఉపాధి హామీ పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించారు. సామాజిక తనిఖీలలో గైహాజరైన కూలీలకు కూడా వేతనాలు ఇచ్చారని, మస్టర్లు కూలి సంతకాలు లేకుండా ఉన్నా కూడా వేతనం మంజూరు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిడి సోమశేఖర్ రెడ్డి, ఎంపీడీవో రఘురాం,డివిఓ రామలింగారెడ్డి ,సోషల్ ఆడిట్ ఎస్ఆర్పీ చెన్నారెడ్డి,ఏపీఓ సుధారాణి ,కమలాపురం ఏపీఓ పార్థసారథి, పిఆర్ఏఈ విష్ణువర్ధన్ రెడ్డి,టిడిపి మండల అధ్యక్షుడు లేబాక నాగేశ్వర్ రెడ్డి, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చేపల పెంపకంపై అవగాహన అవసరం

డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్

విశాలాంధ్ర-యర్రగుంట్ల : మండల పరిధిలోని చిలమకూరు, చిర్రాజుపల్లె, సున్నపురాళ్లపల్లె, కదిరివారిపల్లె, కర్పుగుంటపల్లె గ్రామాలను కలిపి ఐఎఫ్‌సీ క్లస్టర్ ఏర్పాటు చేశారు. ఈ గ్రామాల పరిధిలోని 31 ఎఫ్‌పీజీల నందు ఉన్న 310 మంది మహిళా రైతులకు నెలకు రూ.10వేలు అదనపు ఆదాయం కల్పించేందుకు కొర్రమీను చేపలపై అవగాహన సదస్సు బుధవారం జరిగింది. ముఖ్య అతిథిగా డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ డి.ఆనంద్‌నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన చేపల పెంపకంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఎకరా భూమి ఉన్న రైతు అందులోని 10 సెంట్లలో చేపలను పెంచడం ద్వారా ఏడాదిలో రూ.2లక్షలు ఆదాయం సమకూర్చుకోవచ్చునని సూచించారు. ఆక్వా కల్చర్ ఎండీ సీహెచ్ ఉదయకిషన్ చేపలు పెంచే మహిళా రైతులు బ్యాంకు నుండి రుణ సదుపాయం పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ డీపీఎం -ఎల్‌హెచ్ సుబ్బారెడ్డి, ఏపీఎం జగదీశ్వరి, ఎఫ్‌పీఓ సీసీ మహ్మద్ గౌస్, ఎఫ్‌పీఓ ఓబీఆర్ లక్ష్మీతో పాటు సీసీలు, అకౌంటెంట్లు, ఫార్మర్ మిత్ర, వీఓఏలు, రైతులు పాల్గొన్నారు.

ట్రావెల్స్ బస్సుల అధిక టికెట్ ధరలకు అడ్డుకట్ట వేయాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి వేదిక స్టేట్ కన్వీనర్ జి.నాగరాజు

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల అధిక టికెట్ ధరలకు అడ్డుకట్ట వేయాలని, అదేవిధంగా ప్రత్యేక బస్సుల సంఖ్యను పెంచాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి వేదిక స్టేట్ కన్వీనర్ గంజికుంట నాగరాజు డిమాండ్ చేశారు. ప్రొద్దుటూరు పట్టణంలో బుధవారం నాడు స్థానిక కమిటీ సభ్యులతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ సంక్రాంతి పండుగనే ఆధారంగా చేసుకొని అధిక లాభాలను అర్జించడమే ధ్యేయంగా ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి కొన్ని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో యాజమాన్యం వారు సీటు కెపాసిటి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడమే కాకుండా లగేజి రవాణా కూడ చేస్తున్నారన్నారు. తక్షణమే ఆర్టీఓ, ఆర్టీసి డిపో మేనేజర్ సంబంధిత అధికారులతో కలిసి నిర్వాహకులకు ఒక నిర్దిష్టమైన ధరను నిర్ధారించి ప్రత్యేక కమిటీ బృందంతో తనిఖీలు నిర్వహించి అధిక టికెట్ ధరలకు కళ్లెం వేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు నాయక్, రమణ, ప్రవీణ్ పాల్గొన్నారు.

400మీటర్ల ట్రాక్ చదును పనులు

విశాలాంధ్ర-యర్రగుంట్ల : స్థానిక ముద్దనూరు రోడ్డులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో పీఎం నిధులతో 400మీటర్ల ట్రాక్ చదును పనులు కొనసాగుతున్నాయి. పనులను బుధవారం ఎంఈఓ-2, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామాంజనేయరెడ్డి, క్రాఫ్ ఉపాధ్యాయులు తుపాకుల చంద్ర ఓబుల్‌రెడ్డి కొనసాగుతున్న పనులను పరిశీలించారు. హాకీ కోర్టు, పాఠశాల అభివృద్ధి పనులను చేపట్టేందుకు కూడా అవకాశం ఉంటుందని ఈ సందర్భంగా రామాంజనేయరెడ్డి తెలిపారు.

కార్పోరేట్‌కు ధీటుగా బాలికల జూనియర్ కళాశాలలో విద్యాబోధన

ప్రిన్సిపాల్ గోపతి బాలకృష్ణమూర్తి

విశాలాంధ్ర-మదనపల్లె : కార్పోరేట్ కాలేజీలకు ధీటుగా ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల అత్యుత్తమ విద్యాబోధన అందిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గోపతి బాలకృష్ణమూర్తి పేర్కొన్నారు. బుధవారం కళాశాల అధ్యాపకులు వెంకటరమణ,సాయిశంకర్ రెడ్డి, రెడ్డెప్ప రెడ్డిలతో కలిసి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రామారావు కాలనీలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థినీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా కార్పోరేట్, ప్రైవేట్ కళాశాలలకు ధీటుగా ఫలితాలు సాధిస్తున్నామన్నారు. ముఖ్యంగా 2022-23, 2023-24 విద్యా సంవత్సరంలో రాష్ట్రస్థాయిలో అత్యంత మార్కులు సాధించినట్లు తెలిపారు. నీట్, ఈఏపీసెట్, ఏఐఈఈఈలకు కోచింగ్ తోపాటు స్టడీ మెటీరియల్ ను ఉచితంగా అందజేస్తామన్నారు. యోగ, ధ్యానం కొరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన సౌకర్యం కూడా కల్పిస్తోందన్నారు. తల్లికి వందనం, స్కాలర్‌షిప్స్ వర్తిస్తాయన్నారు. కావున ప్రభుత్వ బాలిక జూనియర్ కళాశాలలో చేరి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు.

ఆటో డ్రైవర్స్ మరియు వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-కొండాపురం: ఆటో డ్రైవర్స్ మరియు వర్కర్స్ ఫెడరేషన్ జనరల్ బాడీ సమావేశం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయం నందు ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి పి.వెంకటరమణ ఆధ్వర్యంలో ఏర్పాటుచేశారు. ఈ సమావేశంలో ఆటో డ్రైవర్స్ మరియు వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు హరి, సీపీఐ మండల కార్యదర్శి మనోహర్ పాల్గొన్నారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2023లో విడుదల చేసిన గెజిట్ నెంబర్ 894 నోటిఫికేషన్ పిఆర్‌సి (106)(1)(2) నూతన మోటార్స్ చట్టాన్ని తెచ్చింది. దీనితో రాష్ట్ర ప్రభుత్వం కూడ జీవో నెంబర్ 21, 31 జీవోల వల్ల డ్రైవర్‌లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డును ఏర్పాటుచేస్తామని ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరారు. చంద్రన్న భీమా 5లక్షల నుండి 10లక్షలకు పెంచాలని, సాధికార సంస్థ ఏర్పాటుచేసి ప్రతి డ్రైవర్‌కు 15వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 7నెలల కాలం దాటిన ఇంతవరకు ఒక్క హామీ కూడ అమలు చేయలేదని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే తగు చర్యలు తీసుకోవాలని లేనిఎడల భవిష్యత్తులో పోరాటాలకు సమాయత్తం అవ్వాలని పిలుపునిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉద్యోగి దుర్మరణం

విశాలాంధ్ర-తొండూరు: మండల పరిధిలోని సైదాపురం క్రాస్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎంపీడీవో కార్యాలయ ఉద్యోగి శ్రీనివాసులరెడ్డి దుర్మరణం చెందాడు. సైదాపురం గ్రామానికి చెందిన శ్రీనివాసులరెడ్డి ఎంపీడీవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంటుగా పనిచేస్తున్నారు. బుధవారం విధులకు హాజరైన శ్రీనివాసులరెడ్డి మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో బైకుపై స్వగ్రామం సైదాపురం బయలుదేరారు. సైదాపురం క్రాస్ వద్దకు వచ్చేసరిగి బైకు అదుపుతప్పడంతో శ్రీనివాసులరెడ్డి కింద పడ్డాడు. దీంతో శ్రీనివాసులరెడ్డి అక్కడికక్కడే మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

ట్రిపుల్ఐటీ విద్యార్థులకు ఉద్యోగాలు

విశాలాంధ్ర-వేంపల్లి: వేంపల్లె మండలం ఆర్కే వ్యాలీ ఇడుపులపాయ లో నిర్వహించిన ప్లేస్‌మెంట్ ఇంటర్వ్యూలలో ఈ-4చదువుతున్న విద్యార్థులు ప్రాంగణ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. సుమారు 30 మంది విద్యార్థులకు ఎవరెస్టు ఇంజనీరింగ్ కంపెనీలో ఉద్యోగాలు లభించడం పట్ల ఆర్కే వ్యాలీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా,పరిపాలన అధికారి పెనుగొండ రవికుమార్, ప్లేస్మెంట్ కోఆర్డినేటర్ కె వినోద్, ప్లేస్మెంట్ ఆఫీసర్ సుందర్‌లు హర్షం వ్యక్తంచేశారు.

గౌడ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: గౌడ సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే నంద్యాల వరద రాజుల రెడ్డి, తెలుగు దేశం పార్టీ బీసీ నాయకులు చల్లా రాజగోపాల్ ఆవిష్కరిం చారు. నెహ్రూ రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మీగడ చంద్రశేఖర్ రెడ్డి, గౌడ సంఘం అధ్యక్షులు దొంతు రామయ్య గౌడ్, సెక్రటరీ పొన్నాల రామకృష్ణ గౌడ్, జాయింట్ సెక్రటరీ కె.భాస్కర్ గౌడ్, కోశాధికారి సంజీవరాయుడు గౌడ్, వెంకటసుబ్బయ్య గౌడ్‌లు క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇవ్వాల్సింది కొండంత - ఇచ్చేది గోరంత

కేంద్రం తీరుపై తులసిరెడ్డి ధ్వజం

విశాలాంధ్ర-వేంపల్లి: కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఇవ్వాల్సింది కొండంత,ఇస్తున్నది గోరంత అని రాజ్య సభ మాజీ సభ్యులు, ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసి రెడ్డి ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంధన,రైల్వే,రోడ్లు, ఔషధ,పారిశ్రామిక రంగాలకు సంబంధించిన 2 లక్షల కోట్ల రూపాయల వివిధ ప్రాజెక్టులకు ప్రధాన మంత్రి మోడీ గారు ఈ రోజు శంఖు స్థాపనలు,ప్రారంభోత్సవాలు చేయడం సంతోషమన్నారు. అదే సమయం లో రాష్ట్రానికి చట్టపరంగా, హక్కుగా రావలసిన అనేక ప్రాజెక్టులకు మోడీ ప్రభుత్వం మోకాలు అడ్డడం శోచనీయమన్నారు.

ఇంటి నిర్మాణానికి రూ.2.50లక్షలు

-ఎమ్మెల్యే వరద

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ఖాళీ స్థలంఉండి ఇళ్లు వేసుకోలేని నిరుపేదలు మరియు పట్టా స్థలం ఉండి ఇల్లు కట్టుకోలేని నిరుపేదలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం హౌసింగ్ ఫర్ ఆల్ స్కీం(పీఎంఏవై) పథకం కింద అర్బన్ ప్రాంతాల వారికి రూ.2.50లక్షలు ఇవ్వడం జరుగుతుందని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి పేర్కొన్నారు. పీఎంఏవై ఒన్స్ యూపీహెచ్‌డీపీ కింద నమోదు చేసుకోవాలని, ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మీ పరిధిలోని సచివాలయం కమ్యూనిటి సెక్రటరీ ద్వారా నమోదు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు డాక్టర్ వి.రవి 99855 73184 అనే నంబర్‌కు సంప్రదించాలని ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి కోరారు.

సమాచార హక్కు చట్టం జిల్లా అధ్యక్షుడుగా హరీష్

విశాలాంధ్ర -రాజంపేట: వైయస్సార్సీపి సమాచార హక్కు చట్టం విభాగం అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా యువ న్యాయవాది చింతల హరీష్ ను నియమించినట్లు పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి నుండి ఆదేశాలు మేరకు ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన యువ న్యాయవాది చింతల హరీష్ మాట్లాడుతూ పార్టీలో చేరిన అతి తక్కువ కాలంలోనే పనిమీద ఉన్నటువంటి నమ్మకముతో అధ్యక్షులుగా బాధ్యతలు అప్పగించిన వైఎస్ఆర్‌సిపి పార్టీ అధ్యక్షులు, వైయస్ జగన్మోహన్ రెడ్డికి, రాజంపేట శాసనసభ్యులు ఆకేపాటి అమర్నాథ్ రెడ్డికి, రాజంపేట మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులు రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

పారిశుధ్య పనులు పరిశీలించిన కమిషనర్

విశాలాంధ్ర-కడపకార్పొరేషన్ :కడప నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మనోజ్ రెడ్డి మార్నింగ్ విజిట్ లో భాగంగా నాగరాజుపేట జిల్లా పరిషత్, పాత బస్టాండ్, పాత మార్కెట్ ప్రాంతాలను శానిటేషన్, నగరపాలక సంస్థ సిబ్బందితో కలిసి పరిశీలించారు. నగరపాలక సంస్థ పక్కన ఉన్నటువంటి అన్నా క్యాంటీన్ ని పరిశీలించారు. అక్కడ ఉన్న సిబ్బందితో మాట్లాడారు. టోకెన్ల విధానాల వివరాలను పరిశీలించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లా పరిషత్ వద్ద ఉన్నటువంటి అన్న క్యాంటీన్ ను పరిశీలిస్తూ అక్కడికి వచ్చినటువంటి ప్రజలతో మాట్లాడుతూ భోజనం రుచిగా ఉందా లేదా అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా అక్కడకు వచ్చే ప్రజలు, అక్కడ పనిచేయుచున్నటువంటి సిబ్బంది కొరకు ఉన్నటువంటి మరుగుదొడ్లను తక్షణమే మరమంతులు చేయించు విధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా ఇంజినీరింగ్, సానిటేషన్ విభాగా అధికారులను ఆదేశించారు. అనంతరం పాత బస్టాండ్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్ పరిశీలిస్తూ జన సంచారం ఎక్కువగా ఉన్నందువలన సిబ్బంది ఎప్పటికప్పుడు ఆ ప్రాంతాలను శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఓల్డ్ మార్కెట్ పరిశీలిస్తూ ప్రజలు ఉదయాన్నే రద్దీగా ఉన్నంత ప్రాంతాన్ని కావున తెల్లవారుజామునే ఆ ప్రాంతమంతా శుభ్రం చేయాలని తెలిపారు. పెద్ద మార్కెట్ లో ఉన్నటువంటి మాంసపు దుకాణాల వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ విచ్చలవిడిగా వేయకుండా ప్రతిరోజు వార్డుకి కేటాయించినటువంటి వాహనాలకు అందజేయాలని తెలిపారు

బిటి కాలేజీని యూనివర్సిటీ చేయాలి

చంద్రబాబు నాయుడు హామీని నిలబెట్టుకోవాలి -యూనివర్సిటీ సాధన కోసం జేఏసీ ఏర్పాటు

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల తీర్మానం

విశాలాంధ్ర- మదనపల్లె :-మదనపల్లె బిటి కళాశాలను యూనివర్సిటీ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) ఆధ్వర్యంలో స్థానిక బీటీ కళాశాలలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు ఈ సమావేశానికి బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల గౌతం కుమార్ అధ్యక్షత వహించగా పార్టీలకతీతంగా జనసేన నుంచి రాందాస్ చౌదరి, కాంగ్రెస్ నుంచి రెడ్డి సాహెబ్, బీటీ కాలేజ్ పూర్వపు కరస్పాండెంట్ మునిరత్నం, సిపిఎం నుంచి శ్రీనివాసులు, హరినాథ్ శర్మ, సిపిఐ నుంచి సాంబశివ, మురళి, బాస్ నుంచి మల్లెల మోహన్, బహుజన జనసేన నుంచి శ్రీ చందు, ఎస్ఎఫ్ఐ నరసింహ, బీటీ కాలేజ్ పూర్వ విద్యార్థులు, పలువురు పట్టణ ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సమావేశ అధ్యక్షుడు బందెల గౌతం కుమార్ మాట్లాడుతూ మదనపల్లి బీటీ కళాశాలకు ఎంతో ఘన చరిత్ర ఉందన్నారు. ఇక్కడ చదువుకున్న నీలం సంజీవరెడ్డి, కోట్ల విజయ భాస్కర్ రెడ్డి లు ముఖ్యమంత్రులుగా రాష్ట్రాన్ని పరిపాలించారన్నారు. ఎంతోమంది రాజకీయవేత్తలు, మేధావులను, ఉన్నతాధి అధికారులు, న్యాయమూర్తులు, కలెక్టర్లను అందించిన ఘనత బీటీ కాలేజ్ కు ఉందన్నారు. ఎంతోమంది మేధావులు అందించిన బీటీ కళాశాల నేడు దయనీయ పరిస్థితుల్లో, కోర్సులు లేక, విద్యార్థులు లేక వెలవెల బోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మదనపల్లె ప్రజలు, పూర్వ విద్యార్థులు, రాజకీయ నాయకులు దృఢ సంకల్పంతో ముందుకెళ్లి యూనివర్సిటీ సాధించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ పార్టీలకతీతంగా, ప్రాంతాలకు అతీతంగా నడుం బిగించాలని కోరారు. గత ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేష్ కూడా బీటీ కాలేజీని యూనివర్సిటీ చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ గత ప్రభుత్వం ఇచ్చిన జీవోను అమలు చేయాలని కోరారు. జనసేన నాయకులు రాందాస్ చౌదరి చొరవచూపి తాను ముఖ్యమంత్రి దృష్టికి, మా నాయకుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి బీటీ కాలేజ్ ని యూనివర్సిటీ చేసేందుకు నడుం బిగిస్తానని చెప్పడం గర్వకారణంగా ఉందన్నారు. కాలేజీని యూనివర్సిటీ చేసేందుకు జేఏసీ ఏర్పాటు చేసి, ముందుకు వెళితే తాము కూడా మద్దతిచ్చి పోరాడుతామని ప్రకటించారు. గౌతమ్ కుమార్ మాట్లాడుతూ కాలేజ్ యూనివర్సిటీ చేసేందుకు అవసరమైన ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఉందని, డీటైల్డ్ ప్రాజెక్టులో రూ.50 కోట్లు మంజూరు చేసి కోర్సులను ప్రవేశపెడితే యూనివర్సిటీ అయిపోతుందని తెలిపారు. ఇందుకు కూటమి నాయకులు శ్రద్ధ వహించి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలు ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర-పులివెందుల: ఈ నెల 10వ తేదీ వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురాతనకాలం నాటి ఎద్దులకొండపై వైకుంఠ ఏకాదశి వేడుకలు పురస్కరించుకుని ఉదయం 5గంటల నుంచి ఉత్తరద్వార దర్శనం ఏర్పాటుచేశామన్నారు.ఎద్దులకొండకు వచ్చే భక్తులకు స్థానిక ఆంజనేయస్వామి గుడి వద్ద నుంచి ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అలాగే భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆయన విజ్ఞప్తిచేశారు.

మృతుల కుటుంబాలకు రూ.3 లక్షల ఎక్స్ గ్రేషియా

విశాలాంధ్ర-మదనపల్లె : రామసముద్రం మండలం, మాలేనత్తం పంచాయతీ, సింగంవారిపల్లి గ్రామప్రజలు వెంకటేశ్వరస్వామి దైవ దర్శనానికి కాలినడగా వెళ్తున్న సందర్భంలో మంచులో ప్రమాదవశాత్తు అంబులెన్సు ఢీకొని ముగ్గురు మరణించడం జరిగింది. వారి కుటుంబాలని ఆదుకోవాలని కోరుతూ మదనపల్లి శాసనసభ్యులు షాజహాన్ బాషా మంగళవారం ఉదయం కుప్పం పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని కలిసి బాధితులు, వారి కుటుంబాల గురించి తెలియజేశారు. వెంటనే ముఖ్యమంత్రి మరణించిన వారి ఒక్కో కుటుంబానికి రూ. 3 లక్షలు ఎక్స్ గ్రేషియా ప్రకటించారు. ఈ సందర్భంగా బుధవారం మదనపల్లిలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రమాద విషయాన్నీ తెలిపిన వెంటనే సీఎం దిగ్భ్రాంతికి గురయ్యారని, వారికి ప్రభుత్వం తరపున రూ.3 లక్షల పరిహారం అందిస్తామని తెలిపారన్నారు. దీనిపై తాను విజయవాడకు వెంటనే లెటర్ పంపించి నష్టపరిహారం మృతుల కుటుంబాలకు అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యమంత్రి గొప్ప మానవతా వాది అని మరోసారి నిరూపించుకున్నాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ కే.ప్రమీల, టిడిపి నాయకులు రాగినేని రఘుపతి నాయుడు, బాబా తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఈఓపై ఎంపీడీఓకు ఫిర్యాదు

విశాలాంధ్ర- పీలేరు : పీలేరు పంచాయతీ ఈఓ పై పీలేరు సర్పంచ్ హబీబ్ బాషా, వార్డు సభ్యులు స్థానిక ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు. ఎంపీడీఓ అందుబాటులో లేకపోవడంతో ఈఓఆర్ డి కు ఫిర్యాదు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాటలాడుతూ పీలేరు మండలం పీలేరు గ్రామ పంచాయతిలో పనిచేయు ఈ.ఓ పీలేరు పంచాయతీ ఆఫీసుకి వచ్చినప్పటినుంచి పంచాయతీ సిబ్బంది మరియు ప్రజలు ఈ ఓ సమస్యల గురించి ఏదైనా అడిగితే వాళ్ళను దురుసుగా మాట్లాడుతూ మరియు బోర్డు తీర్మానాలను కూడా వ్యతిరేకిస్తూ న్నారని ఆరోపణలు చేశారు. పంచాయతీ ఆఫీసులో పని చేయు కంప్యూటర్ ఆపరేటర్ అయినటువంటి దళిత సామాజిక వర్గానికి చెందిన రమణ పై దాడి చేయడం జరిగినది. దీని నిజా నిజాలను సి.సి టి.వి ఫుటేజ్ ని పరిశీలించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పాల్గొన్నారు.

భూ తగాదాలతో నలుగురిపై దాడి

విశాలాంధ్ర- మదన పల్లె :-భూ తగాదాల కారణంగా జరిగిన దాడిలో నలుగురు తీవ్ర గాయపడిన సంఘటన బుధవారం కలకడ మండలం లో చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు.. కలకడ మండలం గుండావాండ్లపల్లి కి చెందిన వీరనాగుల నాయుడు (60) వ్యవసాయం చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి చెందిన ఎకరా భూమిని అదే గ్రామంకు చెందిన చిన్నప్ప కుటుంబీకులు కబ్జా చేశారు. ఈ విషయమై వీర నాగుల నాయుడు 2016 నుంచి రెవెన్యూ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న పట్టించుకోలేదు. సర్వే చేయించే ప్రతి సందర్భంలోనూ చిన్నప్ప కుటుంబీకులు ఘర్షణకు దిగేవారు. ఈ క్రమంలో గతవారం జరిగిన రెవెన్యూ సదస్సులో తమకు న్యాయం చేయాలంటూ వీరనాగుల నాయుడు అర్జీ పెట్టుకున్నాడు. దీంతో తహశీల్దారు గ్రామానికి చేరుకుని వీరనాగుల నాయుడు భూమిని కొలతలు వేయాలని సర్వేయర్ ను ఆదేశించారు. జరిగిందని, సర్వేయర్ కొలతలు వేయడానికి గ్రామానికి చేరుకున్న సమయంలో చిన్నప్ప కుటుంబీకులు, అతను అనుచరులు సుమారు 30 మంది వీర నాగుల నాయుడు పై దాడికి చేశారు. ఆ సమయంలో అక్కడే ఉన్న వీరనాగుల నాయుడు తమ్ముడు బాలనాగు, ఇద్దరు కుమారులు నాగేశ్వర్, యశ్వంత్, కాంతమ్మ నారాయణలు అడ్డుకోవడంతో వారిని కూడా చితక బాదారు. దాడిలో గాయపడిన నలుగురిని కుటుంబ సభ్యులు మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు. కలకడ పోలీసులు విచారణ చేపట్టారు.

కుమారకాల్వలో స్వచ్ఛభారత్

విశాలాంధ్ర- వేంపల్లి: చక్రాయపేట మండలం కుమారకాల్వ గ్రామంలో ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీ ఎన్ఎస్ఎస్-15 విద్యార్థులు స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశుభ్రత-పచ్చదనం, పర్యావ రణ పరిరక్షణ, విద్య ఆవశ్యకత తదితర అంశాలను వారు గ్రామస్తులకు వివరించారు. స్వచ్ఛందంగా సేవలందించిన విద్యార్థులతో పాటు కో ఆర్డినేటర్ సుబ్బరాయుడు లను డైరెక్టరు కుమారస్వామిగుప్తా, కో ఆర్డినేటరు దీప్తిలు అభినందించారు.

సూట్కేసుల పంపిణీ

విశాలాంధ్ర- పులివెందుల: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినిలకు బుధవారం సూట్కేసులు పంపిణీ చేశారు. హెచ్పి గ్యాస్లో పనిచేస్తున్న శ్రీనివాసులు అను దాత ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రిన్సిపల్ గణేష్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటరు నాగేంద్రమ్మ, స్నేహితఅమృతహస్తం సేవా సమితి అధ్యక్షులు రాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ

చిన్నారులతో ముచ్చటించిన ఎమ్మెల్యే చైతన్య

విశాలాంధ్ర- యర్రగుంట్ల : కమలాపురం శాసనసభ్యులు పుత్తా చైతన్యరెడ్డి బుధవారం కుప్పురివారిపల్లె మండల పరిషత్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యా యులతో మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు పరుస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో లోపాలు లేకుండా చూసుకో వాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే విద్యార్థులతో మాటా మంతీ కలిపి కుశల ప్రశ్నలు వేశారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకరిస్తామని సమస్యలు తన దృష్టికి తేవాలని కోరారు.

హోం ట్రయాంగిల్ వేదికను

సద్వినియోగం చేసుకోండి: కమీషనర్

విశాలాంధ్ర-యర్రగుంట్ల : కమలాపురం పురపాలిక పరిధిలోని టెక్నీషియన్లు హోం ట్రయాంగిల్ వేదికను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమీషనర్ పగడాల జగన్నాధ్ సూచిం చారు. బుధవారం నగర పంచాయతీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టెక్నీషియన్లు తమ వివరాలను నమోదు చేసుకోవడం ద్వారా మెప్మా విభాగం నుండి యూనిఫామ్, ఐడీ కార్డులు పొందాలన్నారు. టెక్నీషియన్ల వివరాలు వేదిక యాప్లో నమోదు కావడం వలన అవసరం ఉన్న ప్రజలు యాప్ ద్వారా సంప్రదించే వీలు ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో టౌన్ మిషన్ కోఆర్డినేటర్ నాగేంద్ర, కమ్యూనిటీ ఆర్గనైజర్లు లావణ్య, ప్రజ్యోతి, మెప్మా ఆర్పీలు, టెక్నీషియన్లు పాల్గొన్నారు.

129 జీవో ప్రకారం వేతనాలివ్వాలని వినతి

విశాలాంధ్ర- యర్రగుంట్ల : కార్మికులందరికీ 129 జీవో ప్రకారం వేతనాలు ఇవ్వాలని బుధవారం ఆర్టీపీపీ చీఫ్ ఇంజనీర్కు ఏఐటీయూసీ వినతి చేసింది. 167 జీవోలో మిగిలి ఉన్న కార్మికులకు ఈ అవకాశం కల్పించాలని కోరారు. ఈ ఏడాది జనవరి 3వ తేదీన 167 జీవోను రద్దు చేసి 129 జీవోప్రకారం వేతనాలు ఇవ్వాలని చెప్పడంతో కార్మికులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. స్పందించిన సీఈ పరిశీలించి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ అనుబంధ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారుబోయిన రాము, ప్రాంతీయ అధ్యక్ష, కార్యదర్శులు వెన్నపూస సాంబశివారెడ్డి, నందన్ రాజేష్తో పాటు దంతం దస్తగిరి, మహిళా కార్మికులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా మారిన ప్రజాపంపిణీ వ్యవస్థ

డిసెంబర్, జనవరి నెలల్లో సరఫరాకు నోచుకోని కందిపప్పు

పగడ్బందీగా సరఫరా చేయండి : సీపీఐ నేతల డిమాండ్

విశాలాంధ్ర -కడప రూరల్ : ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందించే నిత్యావసర వస్తువులు కడప మండల పరిధిలో పక్కదారి పట్టకుండా పగడ్బందీగా సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని బుధవారం మండల తాసిల్దార్ నారాయణరెడ్డికి సిపిఐ నగర కార్యదర్శి ఎన్.వెంకటశివ, సహాయ కార్యదర్శిలు కేసి.బాదుల్లా, ఉద్దె. మద్దిలేటి, నాయకులు మునయ్య, నాగేశ్వరరావులు వినతిపత్రం సమర్పిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ డిపోల ద్వారా అందిస్తున్న నిత్యావసరాలు సామాన్య, పేద, మధ్య తరగతి ప్రజలకు ఏ మాత్రం ఊరట నివ్వటం లేదని కేవలం బియ్యం, పంచదార మాత్రమే మొక్కు బడిగా సరఫరా చేసి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపించారు.కంది పప్పు బహిరంగ మార్కెట్లో ఆకాశాన్ని తాకుతున్నదని సంక్రాంతి పండుగ కైనా కందిపప్పు తదితర నిత్యావసర వస్తువులు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందిస్తారన్న ప్రజలు ఆశలు అడి అశాయ్యాలు అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఓ వైపు కరెంటు, పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు విపరీతంగా పెరగడం, మరోపైపు వంటింటి సామాన్లకు రెక్కలు రావడంతో పండుగ పూట సామాన్య ప్రజలు పస్తులుండే దుస్థితి నెలకొందన్నారు.రేషన్ డిపోల ద్వారా 11 రకాల నిత్యావసరాలను పాలక ప్రభుత్వాలు అందించేవి గత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం బియ్యం, పంచదారకే పరిమితం అయ్యింది నూతన చంద్రబాబు నాయుడు ప్రభుత్వం సైతం ప్రతి నెలా పదో తేదీ దాటిన తర్వాత అత్యధిక మందికి డీలర్లు బియ్యం పంచదార మాత్రమే అందిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయన్నారు.ఈ విమర్శలను అధిగమించి రేషన్ డిపోల్లో 11 రకాల నిత్యావసరాలు అందించాలని సీపీఐ నేతలు డిమాండ్ చేశారు.

సీఎం చంద్రబాబును కలిసిన మఠం వాసి

విశాలాంధ్ర - బ్రహ్మంగారి మఠం : ప్రముఖ పుణ్యక్షేత్రమైన జగద్గురు వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఎనిమిదవ తరం ముని మనవడు దిగవంతం మూడో కుమారుడు వీరంభట్లయ్య స్వాములు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలి శారు. చిత్తూరు పర్యటనల భాగంగా కుప్పం నియోజకవర్గ ఆర్అండ్ బిఅతిథి గెస్ట్ హౌస్‌లో ఆయన చేతులు మీదుగా బ్రహ్మంగారి 2025 నూతన సంవత్సర,క్యాలెండర్లను సీఎం చేతుల మీదుగా విడుదల చేయించారు. అనంతరం బ్రహ్మంగారి ఆలయ అభివృద్ధి మఠంపై సీఎందృష్టికి తీసుకెళ్లారు. పరిష్కరించే విధంగా చూడాలని వారికి సూచించారు.

పుట్టా ప్రిమియర్ లీగ్, క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

విశాలాంధ్ర - బ్రహ్మంగారి మఠం : మండల పరిధిలోని నందిపల్లి గ్రామ సమీ పంలో క్రికెట్ గ్రౌండ్‌లో జట్టులతో క్రికెట్ టోర్నమెంట్ తెలుగుదేశం పార్టీ నాయకులు కానాల మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు సుబ్బారెడ్డి ప్రారంభించారు యువకులకు సంక్రాంతి పండగ సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్ను పుట్టా ప్రీమియర్ లీగ్ టీ10 క్రికెట్ టోర్నమెంట్ బెస్ట్ మ్యాచ్ అగ్రహారం జట్టు పై వాంపల్లి చెరువు క్రికెట్ జట్టు విజయం సాధించారు. మొదటి బహుమతి రూ.50 వేలు రెండో బహుమతి రూ.30లు, మూడో బహుమతి రూ.15 వేలు, బాగా ఆడిన వారికి రూ.1116 అందజేశామని తెలిపారు. అందులో భాగంగానే క్రికెట్‌ను ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమానికి టీడీపీ నేతలు చంద్రబాబు, యత్తపుఈశ్వర్ రెడ్డి, కార్యకర్తలు క్రికెట్ టోర్నమెంట్ జట్లూ క్రికెట్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

రవి శంకర్‌కు పురస్కారం ప్రధానం

విశాలాంధ్ర-కడప : భారత ప్రభుత్వ, నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో విశాఖపట్నంలో ఐదు రోజుల పాటు నిర్వహించిన ఇం టర్ డిస్టిక్ యూత్ ఎక్స్చేంజ్ కార్య క్రమంలో రవిశంకర్‌కు పురస్కారం ప్రదానం చేశారు. కడప జిల్లా నుండి 27 మంది యువ బృందంతో విశాఖ పట్నంలో జరిగిన కార్యక్రమానికి వెళ్లినట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా వికశిత భారత్ అంశంపై ప్రసంగించడం ద్వారా అవార్డును పొందినట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ నెహ్రూ యువ కేంద్ర డిప్యూటీ డైరెక్టర్ మహేశ్వర రావు, ఐఆర్ఎస్ అధికారి రవి కిరణ్ చేతుల మీదుగా మేమెంటో, సర్టిఫికెట్ ను అందుకున్నారు. యువతలోని శక్తి సామర్థ్యాలు వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు చాలా దోహదపడతాయని వెల్లడించారు.

ముక్కోటికి ముస్తాబైన ఒంటిమిట్ట కోదండ రాముడు

విశాలాంధ్ర - ఒంటిమిట్ట : ఈనెల 10వతేదీనశుక్రవారంముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని కోదండ రామాలయం ముస్తాబ్ చేశారు ఆలయం ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు కోదండ రాముడు దర్శనం ఇవ్వనున్నాడు ఉత్తర దారం గుండా కోదండ రామునిదర్శించుకుంటే సర్వపాపములు నశించిపోతా యని భక్తుల విశ్వాసం ముక్కోటి ఏకాదశికి కోదండ రామాలయాన్నిబెంగళూరు నుంచి తెప్పిచ్చిన వివిధ రకాల పరిమళాలు వెదజల్లే పుష్పాలతో విద్యుత్ దీపాలతోశోబాయమనంగా ఆలయాన్ని టిటిడి అధికారులుముస్తాబు చేశారు వేకువజామునునుండే భక్తుల రద్దీతో కోదండ రామాలయం పోటెత్తా నున్న నేపథ్యంలో అందుకుతగ్గట్లు ప్రత్యేక క్యూ లైన్ లను ఏర్పాటు చేశారు.

క్యాన్సర్ పై అధునాతన పరిశోధన చేసిన హేమలతకు వైవీయూ డాక్టరేట్

విశాలాంధ్ర-కడప వైవీయూ : పర్యావరణ సహిత మానవ శరీరంలో ఔషధ సరఫరా, గాయాలను త్వరి తగతిన నయం చేయడానికి నానోడ్రగ్ కనుగొన్న రసా యన శాస్త్ర శాఖ స్కాలర్ డి.హేమలతకు యోగి వేమన విశ్వవిద్యాలయం డాక్టరేట్ ను ప్రకటించింది. రసాయన శాస్త్ర విభాగ ఆచార్యులు కె.ఎస్.వి. కృష్ణారావు పర్యవేక్షణలో "సింథసిస్ అండ్ క్యారెక్టర్జేషన్ ఆఫ్ పాలి శాఖరాయిడ్ బేస్డ్ హైడ్రోజెన్స్ ఫర్ కంట్రోల్ రిలీజ్ ఆఫ్ కీమోథెరపీ ఏజెంట్స్ అండ్ యాంటీ మైక్రోబియన్ అప్లికేషన్" అనే అంశంపై పరిశోధన చేసిన సిద్ధాంత గ్రంథం విశ్వవిద్యాలయానికి సమర్పించారు. డి.హేమలతకు డాక్టరేట్ సర్టిఫికెట్‌ను వైవీయూ పరీక్షల నిర్వహణ అధికారి ఆచార్య కె.ఎస్.వి. కృష్ణారావు జారీ చేశారు. ఈమె చేసిన సిద్ధాంత అంశంపై పలు ప్రఖ్యాత అంతర్జాతీయ పబ్లికేషన్స్ ఎల్సి వేర్, అమెరికన్ కెమికల్ సొసైటీ, స్ప్రింజర్ వంటి జర్నల్స్‌లో పరిశోధనా పత్రాలు, బుక్ చాప్టర్స్ ప్రచురింపబడినవి. వైవీయూ రసాయన శాస్త్ర విభాగంలో డాక్టరేట్ అందుకున్న డి.హేమలతను పరిశోధన గైడ్ డాక్టర్ కెఎస్‌వి కృష్ణారావును ఉపకులపతి ఆచార్య కె. కృష్ణారెడ్డి, కులసచివులు ఆచార్య పి పద్మ, ప్రిన్సిపల్ ఆచార్య ఎస్. రఘునాథ్ రెడ్డి, రసాయన శాస్త్ర అధ్యాపకులు పరిశోధక విద్యార్థులు అభినందించారు.

అక్రమార్కులకు అధికారుల అండదండలు మెండు.!

ఎర్రచందనాన్ని మించిన రేషన్ బియ్యం అక్ర రవాణా

పెద్ద ఎత్తున రేషన్ బియ్యం స్వాధీనం

పట్టుబడిన ఐచర్ వాహనాన్ని వదిలేసినట్టు సమాచారం?

విశాలాంధ్ర - వేముల : వేముల మండలంలోని మీదిపెంట్ల పంచాయతీలోని బక్కన్నగారి పల్లె గ్రామానికి చెందిన బి.వెంకట్ నాయక్ అరటి తోటలోనీ ప్యాక్ హౌస్ లో అక్రమంగా నిల్వ చేసి రవాణాకు సిద్ధం చేస్తుండగా 4800 కేజీల రేషన్ బియ్యాన్ని, ఒక ఐచర్ వాహనాన్ని విజిలెన్స్ అధికారులు మంగళవారం రాత్రి 11 గంటలకు సమయంలో పట్టుకున్నారు. అయితే విజిల్స్ అధికారులు ఐచర్ వాహ నాన్ని తప్పించి కేవలం రేషన్ బియ్యం పట్టుకున్నట్లు చూపించడంపై పలు అను మానాలకు తావిస్తోంది. సత్యసాయి జిల్లా బుక్కపట్నం మండలం గోపులాపురం తాండకు చెందిన కె.లక్ష్మి ప్రసాద్ నాయక్ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి బియ్యాన్ని తమ ఏజెంట్ల ద్వారా పల్లెల నుంచి సేకరించి మీది పెంట్ల గ్రామ పొలంలో డబ్బింగ్ చేసి రవాణాకు సిద్ధం చేస్తుండగా పక్కా సమాచారంతో విజిలెన్స్ సిఐలు శివన్న, నారకుల నారాయణ,ఏవో బాల గంగాధర్ రెడ్డి, పులివెందుల ఎన్ఫోర్స్మెంట్ డిప్యూటీ తహసిల్దార్ సుధీర్ లు దాడి చేసి ఐచర్ వాహనాన్ని,పెద్ద మొత్తంలో రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. అయితే రాత్రికి రాత్రే సమాచారం అందుకున్న రేషన్ మాఫియా అధికారులను మేనేజ్ చేసి పట్టుకున్న ఐచర్ వాహనాన్ని తప్పించి కేవలం రేషన్ బియ్యం పట్టుకున్నట్లు చూపారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు పంచాల్సిన రేషన్ బియ్యం పగదారు పట్టేందుకు వీలు లేదంటూ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ కొంతమంది అధికారులు వేసిన మాఫియా కుమ్మక్కై రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టించి సొమ్ము చేసుకోవాల్లి అనే ఉద్దేశమని వినికిడి.

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా అన్నమాచార్య యూనివర్సిటీ విద్యార్థుల భారీ ర్యాలీ

విశాలాంధ్ర-రాజంపేట: రాజంపేట అన్నమాచార్య యూనివర్సిటీ రజ తోత్సవాలలో భాగంగా రెండవ రోజు బుధవారం ఉదయం సే నో టు డ్రగ్స్ - వాక్ అగైనెస్ట్ డ్రగ్స్ పేరిట భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ప్రారంభోత్సవానికి అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్య సాగర్ నాయుడు ముఖ్య అతిథిగా, విశ్వవిద్యాలయ చాన్సర్ డాక్టర్ చొప్ప గంగిరెడ్డి విశిష్ట అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ విద్య సాగర్ నాయుడు మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు డ్రగ్స్, ఇతర మాదకద్రవ్యాలకు బానిస కాకుండా, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని వారిచేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కళాశాల ప్రాం గణం నుండి రాజంపేట పట్టణం కొత్త బస్టాండ్ మీదుగ పాతా బస్టాండ్ వరకు ఐదు కిలోమీటర్ల భారీ ర్యాలీని జండా ఊపి ప్రారం భించారు. రాజంపేట పాత బస్టాండ్ వద్ద మానవహారం గా ఏర్పడి సే నో టు డ్రాగ్స్ - వాక్ అగైనెస్ట్ డ్రగ్స్ పేరిట విద్యార్థులు నినా దాలు చేశారు. ఈ కార్యక్రమం ప్రారంభోత్సవానికి ముందు ప్రముఖ సినీ నటులు, వ్యక్తిత్వ వికాస శిక్షకులు కేవీ ప్రదీప్ విద్యార్థులను తన ప్రేరణ ప్రసం గంతో ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య ట్రస్ట్ చైర్మన్

డాక్టర్ సి రామచంద్ర రెడ్డి, అన్నమాచార్య ట్రస్ట్ వైస్ చైర్మన్ చెప్పా ఎల్లారెడ్డి, ప్రో ఛాన్సర్ అభిషేక్ రెడ్డి, విశ్వవిద్యాలయ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఎం.వి. నారాయణ, రిజిస్ట్రార్ డాక్టర్ ఎన్ మల్లికార్జున రావు,యోనో ఎస్.బి.ఐ, రాజంపేట రీజనల్ మేనేజర్ మురళి, డీన్లు, హెచ్వోడీలు మరియు అధ్యాపకులు విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమ నిర్వహణకి యోనో ఎస్.బి.ఐ రీజనల్ కార్యాలయం రాజం పేట వారు తమ వంతు సహకారాన్ని అందించారన్నారు.